జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 107 | హైదరాబాద్, ఫిబ్రవరి 04 గురువారం 2021 | 8 పేజీలు | వెల : 5.00


# దేశ ఐక్యతను ఎవరూ దెబ్బతీయలేరు

## కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :దేశ ఐక్యతను ఎలాంటి దుష్ప్రచారం దెబ్బతీయలేదని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న రైతు నిరసనలపై విదేశాలకు చెందిన కొందరు చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, భారతదేశ ఐక్యతను ఇలాంటివి దెబ్బతీయలేవన్నారు. దేశం అత్యున్నత స్థాయికి చేరకుండా ఏ దుష్ప్రచారమూ నిలువరించలేదని ఓ ట్వీట్‌లో స్పష్టం చేశారు.'దుష్ప్రచారాలు భారతదేశ భవితవ్యాన్ని నిర్ణయించలేవు. అభివృద్ధి పైనే ఇండియా భవితవ్యం ఆధారపడి ఉంది. దేశం ఐక్యంగానే ఉంటుంది. అందరూ కలిసికట్టుగానే ప్రగతిని సాధిస్తాం' అని అమిత్‌షా కుండబద్దులు కొట్టారు. ఇండియా ఎగైనెస్ట్ ప్రోపగాండా, ఇండియా టుగెదర్ అంటూ తన ట్వీట్‌కు యాష్ ట్యాగ్ ఇచ్చారు.

# నిరుద్యోగుల తొందరపాటు పై హైకోర్టు ఆగ్రహం




- కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించొద్దంటూ 2016లో పిటిషన్
- విచారించిన హైకోర్టు, పిటిషన్ కొట్టివేత
- పిటిషన్ దాఖలు చేసిన వారిపై న్యాయమూర్తి ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :కాంట్రాక్ట్ డిగ్రీ, జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించొద్దని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించకుండా.. ప్రత్యక్ష నియామకాలు చేపట్టాలని 2016లో కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు ప్రతిపాదనలు రూపొందించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హిమాకోహ్లి మంగళవారం విచారణ జరిపారు.ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరించిందా..? అని పిటిషనర్లను కోర్టు ప్రశ్నించింది. క్రమబద్ధీకరిస్తారంటూ ఊహించుకొని పిటిషన్ ఎలా దాఖలు చేశారని అసహనం వ్యక్తం చేసింది. పిటిషన్ వేసిన 24 మంది నిరుద్యోగులపై చీఫ్ జస్టిస్ హిమా కోహ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. పిటిషన్ దాఖలు చేసిన ఒక్కొక్కరు రూ.10 వేలు జరిమానా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. దీంతో 24 మంది కలిసి రూ.2.4 లక్షలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

# పేద విద్యార్థినిని ఆదుకోండి

## - గూడూరి సీతామహాలక్ష్మి

- దేశంకాని దేశంలో ఫీజు కట్టలేక అష్టకష్టాలు పడుతున్న విద్యార్థినికి సాయంగా అందరూ ముందుకురండి
- నావంతు సాయం 50వేలు. గూగుల్ పే/ఫోన్ పే నంబరు 9948452904 కు పంపి సాయంను అందించవలసిందిగా విజ్ఞప్తి






విశాఖపట్నం (ప్రజాపాలన) : దేశంకాని దేశంకు ఎంబీబీఎస్ చదుకోవడానికి వెళ్లి ఫీజు కట్టలేని పరిస్థితులలో ఎంబీబీఎస్ సెకండి యర్ మధ్యలో ఆపేసే పరిస్థితిని ఎదుర్కొంటున్న ఒక పేద విద్యార్థిని కి అందరూ ఆమె చదువు పూర్తి కావడానికి చేయుతనందించాలని సావిత్రి భాయ్ పూలే ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరి సీతామహాలక్ష్మి ప్రజలం దరికీ విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళితే హిందూపూర్ కి చెందిన మక్బుల్ జాన్ అనే మహిళ తన కుమార్తెను ఎంబీబీఎస్ చదివించడా నికి ఫిలిప్పీన్స్‌కి పంపింది. మిగతా 3లో..

## సామూహిక భద్రతను అందించే..

# సత్తా భారత్‌కు ఉంది

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



బెంగళూరు,ఫిబ్రవరి 03, ప్రజాపాలన : ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో సామూహిక భద్రతను అందజేసే సత్తా భారత దేశానికి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఈ ప్రాంతంలో సామూహిక భద్రతనందించే పాత్రను మన దేశం పోషించగలదని తెలిపారు. సవాళ్లతో కూడిన నేటి భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో సైనిక దాడి ముప్పు మాత్రమే కాకుండా ప్రకృతి విపత్తులు, కోవిడ్-19 వంటి మహమ్మారుల భయాందోళన కూడా ఉన్నట్లు తెలిపారు. బుధవారం ఏరో ఇండియా డిఫెన్స్ ట్రేడ్ ఎగ్జిబిషన్ ప్రారంభం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భౌగోళిక రాజకీయాల్లో భారత దేశం హిందూ మహాసముద్రం ప్రాంతంలో నమ్మదగిన, ఆధారపడదగిన ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతంలో సామూహిక భద్రత కల్పించే పాత్రను మన దేశం చేపట్టగలదని తెలిపారు.

మిగతా 2లో..



## ఇకపై.. భారత్‌తో యుద్ధం కోరుకోం : పాక్ ఆర్మీ చీఫ్ సంచలన ప్రకటన

ఇస్లామాబాద్,ఫిబ్రవరి 03, ప్రజాపాలన : హఠాత్తుగా దాయాది పాకిస్తాన్ మనస్సు మార్చుకుంది. నిత్యం భారత్‌పై కారాయాలు మిరియాలు నూరే పాక్... శాంతి వచనాలు వల్లించింది. ఇకపై.. తాము భారత్‌తో యుద్ధాన్ని కోరుకోవడం లేదని, శాంతియుతంగా ఇరుదేశాలూ కలిసి సాగాలన్నదే తమ అభిమతమని పాక్ ఆర్మీ చీఫ్ జావేద్ బాజ్వా ప్రకటించారు. పాకిస్తాన్ వైమానికదళానికి చెందిన ఓ కార్యక్రమం రావల్పిండిలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా బాజ్వా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని ప్రపంచ దేశాలకూ శాంతిహస్తాన్ని చాచాల్సిన సందర్భం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. అయితే దీన్ని పాక్ బలహీనతగా ఎవరూ భావించవద్దని, ఈ ప్రకటనకు పెడార్థాలు తీయవద్దని విజ్ఞప్తి చేశారు. ఎవరూ యుద్ధాన్ని కోరుకోవడం లేదని, కేవలం అభివృద్ధిని మాత్రమే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కశ్మీర్ అంశాన్ని ఇరు దేశాలూ శాంతియుతంగా పరిష్కరించుకుంటే బాగుంటుందని సూచించారు. "జమ్మూ కశ్మీర్ ప్రజల అభీష్టం మేరకు జమ్మూ కశ్మీర్ సమస్యను ఇరు దేశాలూ సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పరస్పర గౌరవానికే మేము అత్యధిక ప్రాధాన్యమిస్తాం. ఇదే ఆదర్శానికి మేమే కట్టుబడి ఉంటాం. ప్రపంచ దేశాలకు స్నేహ హస్తాన్ని చాటాల్సిన సందర్భమిది." అని బాజ్వా ప్రకటించారు.

## భాజపాపై పోరాటానికి కాంగ్రెస్‌లో చేరతా

### గుజరాత్ మాజీ సీఎంహౌశంకర్ సిన్హ్ వాఘేలా



అహ్మదాబాద్,ఫిబ్రవరి 03, ప్రజాపాలన : భాజపాపై పోరాటానికి మళ్లీ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు గుజరాత్ మాజీ సీఎం, ప్రజాశక్తి డెమోక్రటిక్ పార్టీ (పీఎస్‌డీపీ) వ్యవస్థాపకుడుహౌశంకర్ సిన్హ్ వాఘేలా అన్నారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో పనిచేసిన 80 ఏళ్ల వాఘేలా.. తనను మళ్లీ కాంగ్రెస్‌లోకి రావాలంటూ అనేకమంది కార్యకర్తలు, నేతలు కోరుతున్నారంటూ బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.హౌగతేడాది భరూచ్ జిల్లాలోని పిరమాన్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్‌పటేల్ అంత్యక్రియలకు హాజరైనప్పుడు చాలా మంది కాంగ్రెస్ కార్యకర్తలు తనను పార్టీలో చేరాలంటూ కన్నీళ్లు పెట్టుకొని అడిగారని తెలిపారు. అంతేకాకుండా కొందరు నేతలు కూడా పట్టుబడుతున్నారన్నారు. భాజపాతో పోరాడేందుకు ఎలాంటి షరతులు లేకుండా కాంగ్రెస్‌లో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాంగ్రెస్‌లో మళ్లీ చేరేందుకు తనకెలాంటి సమస్య లేదని చెప్పారు. సోనియా, రాహుల్ గాంధీతో సమావేశమైన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. వాఘేలా రాజకీయ జీవితం భాజపాతోనేహౌమొదలైంది. 1995లో భాజపా ప్రభుత్వం ఏర్పాటు కాగా.. అప్పుడు తనకు బదులుగా కేశూభాయ్ పటేల్‌ను సీఎంగా ఎన్నుకోవడంతోహౌవాఘేలా తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. భాజపా నుంచి చీలికగా ఏర్పడి కాంగ్రెస్ మద్దతుతో 1996లో సీఎం అయ్యారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రిగా పనిచేశారు. మిగతా 3లో..

# ఇండియాతో సహా 20 దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించిన సౌదీ అరేబియా



రియాద్,ఫిబ్రవరి 03, ప్రజాపాలన :కోవిడ్ 19ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సౌదీ అరేబియా కఠిన చర్యలు చేపట్టింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్ తో సహా మొత్తం 20 దేశాల నుంచి ప్రయాణికుల రాకపై నిషేధం విధించింది. సౌదీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్వర్వుల మేరకు అర్జెంటీనా, యూఏఈ, అమెరికా, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఐర్లాండ్, ఇటలీ, పాకిస్తాన్, బ్రెజిల్, పోర్చుగల్, యునైటెడ్ కింగ్‌డమ్, టర్కీ, దక్షిణాఫ్రికా, స్వీడన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, లెబనాన్, ఈజిప్ట్, జపాన్ ఉన్నాయి. సౌదీ పౌరులకు మినహా నిషేధిత జాబితాలో ఉన్న దేశాల నుంచి ఎవరికి అనుమతి ఉండదు. చివరికి దౌత్యవేతలు, వైద్య సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కూడా అనుమతి ఉండదని స్పష్టం చేసింది. అంతేకాదు..నిషేధిత జాబితాలో ఉన్న దేశాల మీదుగా సౌదీ చేరుకోవాలనుకునే వారికి నిబంధనలు వర్తిస్తాయని, అయితే..వారు 14 రోజుల పాటు క్వారంటైన్ లో ఉన్న తర్వాత సౌదీకి ప్రయాణం చేయవచ్చని వివరించింది. దౌత్యవేతలు, వైద్య సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కూడా నిషేధిత జాబితాలోని దేశాల మీదుగా సౌదీ ప్రయాణం చేయాలనుకుంటే 14 రోజుల క్వారంటైన్ తప్పనిసరి అంటూ వెల్లడించింది. కోవిడ్ ముప్పు నుంచి దేశ ప్రజలను కాపాడుకునేందుకే ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేసింది. అయితే..నిషేధిత జాబితాలో ఉన్న దేశాల ప్రజలు..ఇతర దేశాల్లో 14 రోజులు క్వారంటైన్ లో ఉండి సౌదీకి ప్రయాణం చేయవచ్చా అనే దానిపై కింగ్డమ్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు.





## సమస్యలను పరిష్కరించాలని మున్సిపాలిటీ కమిషనర్ కు వినతి

క్యాతనపల్లి, జనవరి03, ప్రజాపాలన :క్యాతనపల్లి మున్సిపల్ పరిదిలోని రామకృష్ణ పూర్ పట్టణంలో నెలకొన్న సమస్యల పై మున్సిపాలిటీ కమిషనర్ జి, వెంకట నారాయణ కు సామాజిక ఉద్యమ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సీ పాలిటి లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్మశాన వాటికలు, స్నానాల నీటి నల్లాల, చెత్త వేయడానికి డంప్ యార్డ్ తో పాటు కూరగాయల మార్కెట్ యార్డ్ యేర్పాటు చేయాలని కోరారు. రహదారులకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు, రోడ్లపై గుంతలను వెంటనే పుడ్చి,నూతన రోడ్లు వేయాలని కోరారు, తడి చెత్తపొడి చెత్త తీసుకుపోయే ట్రాలీ వాహనాలను వార్డుకు ఒకటి కేటాయించాలని తెలియజేశారు, ఇండ్ల పట్టాల ఇవ్వాలని, గ్రంథాలయం ఏర్పాటు చేయాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు పలిగిరీ కనకరాజు, సదానందం. రయాలింగు. రాచర్ల శరేశ్, లు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వ్యవస్థలకే లాభం చేకూరేలా ఉంది



జన్నారం ఫిబ్రవరి 3 ప్రజాపాలన :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగేలా ఉందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోర్లకుంట ప్రభుదాస్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిరోజు పెట్రోల్ డిజిల్ ధరలను పెంచుతూ పేదవారికి ఆర్థికంగా నష్టం జరిగే విధంగా ఉందని కార్పొరేట్ వ్యవస్థకే లాభంచేకూర్చేవిధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కరోనా సమయంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం పేదవారికి తీవ్ర నష్టం చేస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు ఫసి ఉల్లా ముత్యం రాజన్న ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరుకు ఫిర్యాదు చేసిన రైతు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 ( ప్రజాపాలన ) : రియల్ ఎస్టేటర్ల చెర నుండి నా భూమిని విడిపించాలని జిల్లా కలెక్టర్ పౌసుమి బసు కు మాదారం చిన్నయ్య బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ నివాసి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాదారం కిష్టయ్య కుమారుడు మాదారం చిన్నయ్య భూమిని రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, పోలీసులతో కుమ్మక్కై భూ ఆక్రమణ చేశారని ఆరోపించారు. చింతలపల్లి గ్రామానికి చెందిన నారా రాకేష్ దగ్గర సర్వే నంబర్ 198/ఆ/1/3/3 లో రెండు ఎకరాల ఇరవై గుంటల భూమిని మాదారం చిన్నయ్య కొన్నాడన్నారు. మాదారం చిన్నయ్య కొన్న భూమిలోకి రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఎన్కేపల్లి రాములు, ఉమ్మెంతాల శ్రీనివాస్ గుప్త, ఎం.మల్లేశంలు అక్రమంగా కబ్జా చేశారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానని వివరించారు. ఎస్ఐ భీమ్ కుమార్ రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో కుమ్మక్కై రివాల్వర్ తో బెదిరించాడని కలెక్టర్ కు, డిజిపికి, ఐజికి, ఎస్పికి ఫిర్యాదు చేశానని తెలిపారు. సంబంధిత రెవెన్యూ అధికారులు నా భూమిని సర్వే చేయించి నా భూమి నాకు ఇప్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశాడు. అదే విధంగా ఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు.



## పోస్ట్ ఆఫీస్ వద్ద గల అంబేద్కర్ సర్కిల్లో భారతరత్న అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా కు వినతి పత్రం సమర్పించిన దళిత ప్రముఖులు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 03 (ప్రజాపాలన) : కొత్తగూడెం అంబేద్కర్ సెంటర్ వద్ద గల సర్కిల్లో సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసి తన అపరిమిత మేధస్సుతో భారత రాజ్యాంగాన్ని రచించి ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలు మైనార్టీలు మరియు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి కూడా రిజర్వేషన్ కల్పించి తాను రచించిన ఆదర్శప్రాయమైన రాజ్యాంగం ద్వారా భారత దేశ అభివృద్ధికి సమగ్రతకు దశ దిశ నిర్దేశకత్వాన్ని చూపించిన మార్గదర్శకుడు మహానుభావుడు భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారి కాంస్య విగ్రహాన్ని అంబేద్కర్ సెంటర్ వద్ద గల సర్కిల్లో ప్రతిష్టించాలి అన్నది కొత్తగూడెం దళితుల 20 ఏళ్ల చిరకాల స్వప్నం అని అది బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజల మనిషి అపర భగీరథుడు అభివృద్ధి సాధకుడు లికొత్తగూడెం శాసన సభ్యులు శ్రీ వనమా వెంకటేశ్వరరావు గారి చేతుల మీదుగా జరగాలని కొత్తగూడెంలి లిదళిత ప్రముఖులు ప్రముఖ వైద్యులు డాక్టర్ టి విజేంద్ర రావు డాక్టర్ జి కనకరాజు మద్దెల శివ కుమార్ కూసపాటి శ్రీనివాస్ కోలపూడి ధర్మరాజు మంద హనుమంతు సబ్బవరపు మధుసూదన్ చిన్ని అంతోటి పాల్ ఎమ్మెల్యే శ్రీ వనమా గారికి వినతి పత్రాన్ని సమర్పించారు. 03 02. 2021 నాడు దళిత ప్రముఖుల బృందం శ్రీ వనమా గారి స్వగృహానికి వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించగా స్పందించిన ఎమ్మెల్యే శ్రీ వనమా మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ తన ఆరాధ్య దైవమని బడుగు బలహీన వర్గాలకు సమాజంలో సమున్నత



స్థానాన్ని కల్పించిన త్యాగధనుడు అని ఎన్ని అడ్డంకులు వచ్చినా అంబేద్కర్ సెంటర్ వద్ద గల సర్కిల్లో అంబేద్కర్ గారి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించడం తన జీవిత లక్ష్యమని అవసరమైతే ఈ విషయంలో తాను జైలుకు కూడా వెళ్లడానికి సిద్ధమని ఉద్ఘాటించారు వాగ్దానం చేసినారు.శ్రీ వనమా గారి స్పందనకు వాగ్దానానికి దళిత ప్రముఖులు సంతోషించి చప్పట్లతో తమ హర్షధ్వానాలు తెలిపి శ్రీ వనమా గారికి కృతజ్ఞతలు తెలియజేశారు

## కండ్లముందు లక్ష్యం మాత్రమే కనబడితే విజయం పాధాక్రాంతం అవుతుంది

### విద్యార్థినిలను సన్మానించిన స్వేరో సర్కిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల శ్రీ నివాస్

### సివిల్స్ లక్ష్యాన్ని చేరుకుంటామన్న విద్యార్థినులు

### గురుకులాల కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపిన సేర్వోస్‌లు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి03, ప్రజాపాలన : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లోని కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి ఢిల్లీ యూనివర్సిటీ లో చదువుతున్న గౌరుబాయ్, రాజేశ్వరి,సారికలను స్వేరో సర్కిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల శ్రీనివాస్ ఆధ్వర్యం లో ఘనంగా మంగళవారం సన్మానించారు. అతి మారుమూల గిరిజన గ్రామాలలో నుండి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఢిల్లీ యూనివర్సిటీలో ప్రవేశం పొందిన వీరిని శ్రీనివాస్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేరోలు ఎంత పెద్ద సమస్యలు ఎదురైన ధైర్యంగా ఎదురుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవలన్నారు. ఈ విద్యార్థులను అందరూ ఆదర్శనంగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల కండ్లముందు వారి లక్ష్యం మాత్రమే కనబడలన్నారు. ఆ యొక్క లక్ష్యసాధన కు నిర్విరామంగా కృషి చేయాలన్నారు. మట్టి లోనుండి మణిక్యాలను వెలికితీసి ప్రపంచానికి ఒక్క కొత్త జ్ఞాన వంతులను అందిస్తున్న గురుకులాల కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సర్ యొక్క కృషి ఫలితంగా తము కోటీశ్వర్ల పిల్లలు చదివే యూనివర్సిటీ లో చదివే అవకాశం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. వారి యొక్క లక్ష్యసాధన కు చేస్తున్న కృషిని వివరించారు. సివిల్స్ లక్ష్య సాధనే తమ ధ్యేయం అన్నారు. సివిల్స్ సాధించి సమాజానికి తము పొందినదానిని



తిరిగి చెల్లిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ ఓ ప్రవీణ్ , స్వేరో సర్కిల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కల్యాణం ఉష ,జిల్లా అధ్యక్షులు కొండ మహేందర్, ప్రధాన కార్యదర్శి దుర్గం తులసి రాం, ఉపాధ్యక్షులు గద్దల తిరుపతి, అధికార ప్రతినిధి బిజ్జురి రమేష్, జాయింట్ సెక్రెటరీ అక్కపెల్లి శ్రీనివాస్, టిజిపిఎ నార్త్ జోన్ సెక్రెటరీ దామేర రాజయ్య, జిల్లా అధ్యక్షుడు మెడపట్ల మల్లేష్, పిట్ ఇండియా ఫౌండేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటే రాయమల్లు, ఉపాధ్యాయులు రమేష్ స్రవంతి, సృజన, స్వాతి, మోహన్ రాజేష్ లావణ్య భిందు మాధవి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలలో వంటగదిని నిర్మించాలి

### ప్రభుత్వ విద్యసంస్థలకు ఉచితంగామాస్కులు,శానిటైజర్ అందించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి03, ప్రజాపాలన :కోటపల్లి మండలం లోని మోడల్ పాఠశాలలో వంటగదిని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం లోనిమోడల్ పాఠశాలను సందర్శించించి అక్కడి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి 1వ నుండి కరోన నిబంధనలు పాటిస్తు ప్రారంభమైన ప్రభుత్వ విద్యసంస్థల్లో విద్యార్థులకు కనీసం మాస్కులు , శానిటైజర్ ప్రభుత్వం అందించడం లెదని అన్నారు.. దింతో పాఠశాల,కళాశాలల యాజమాన్యలు అనెక ఇబ్బందులు ఎదుర్కోంటు. చివరికి విద్యార్థులె వారి యొక్క మాస్కులు వారి వెంట తెచ్చుకోవాలుంటున్నారని అన్నారు. కొన్ని పాఠశాలల్లో మాస్కు లెకపోతె



పాఠశాలకు రావద్దు అంటు చెప్తున్నారని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. అదేవిధంగా చాలా మంది విద్యార్థులు హస్టల్ సౌకర్యం ఉందని కళాశాలలో చేరితే ప్రస్తుతం అధికారులు మాత్రం కోందరికె అనుమతులు ఉన్నాయంటున్నారని అన్నారు.విద్యార్థులందరికీ హస్టల్ లో అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా స్థానిక ఎస్.సి హస్టల్ అపరిశుభ్రంగా ఉందని , స్థానిక వార్డెన్ మూత్రశాలలు,మరుగుదోడ్లు శుభ్రం కుడా చెయించడం లెదని పేర్కొన్నారు. వెంటనె హస్టల్ ను శుభ్రపరిచి సౌకర్యాలు కల్పించాలన్నారు..ఇప్పటికైన స్థానిక జిల్లా అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కారించాలని లెని యేడల అందోళన కార్యక్రమాలు చెస్తామాని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, రాజెష్ ,అంకిత ఉన్నారు.



## అభివృద్ధి పనులను పరిశీలించిన బోగ శ్రావణి

జగిత్యాల, ఫిబ్రవరి 03 (ప్రజాపాలన): నర్సింగాపూర్ డంపింగ్ యార్డ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న డిఆర్సిసి మరియు ఎఫ్ఎస్టిపి బిల్డింగ్ పనులను జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణం పనులను త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జంబర్తి రాజ్ కుమార్ అరుముళ్ల పవన్ సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ రాము విజయ్ ఈఈ వెంకటేష్ మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## సామూహిక భద్రతను అందించే..సత్తా భారత్‌కు ఉంది

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను కొనసాగించడంలో వైమానిక, గగనతల శక్తి సామర్థ్యాలు ప్రధాన పాత్ర పోషించడం కొనసాగుతుందన్నారు. కోవిడ్-19 మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో, భావసారూప్యతగల దేశాలతో సంబంధాలను పటిష్టం చేసుకోవడం చాలా అవసరమని చెప్పారు. ఏరో ఇండియా ఈవెంట్ మూడు రోజులపాటు జరుగుతుంది. బుధవారం ప్రారంభమైన ఈ ఈవెంట్ ఆసియాలో అతి పెద్ద మిలిటరీ ఏవియేషన్ ఎగ్జిబిషన్ అని చెప్తున్నారు. స్వయం సమృద్ధ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దీనిని నిర్వహిస్తున్నారు.

# అక్రమంగా కాదు.. సక్రమంగా సౌండ్ నెస్ సర్టిఫికెట్ తో కూల్చేశాం

### జగిత్యాల జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్

### ప్రశ్నించటమే తప్ప అభివృద్ధికి పనికిరాని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 03 (ప్రజాపాలన): జగిత్యాల అర్బన్ మండలం, గోపాలరావుపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం రోజు జగిత్యాల జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. దావ వసంతసురేష్ మాట్లాడుతూ గోపాలరావుపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భవనాలను చెట్లను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి కలెక్టర్ కు చేసిన పిర్యాదుపై వివరణ ఇస్తూ.... శిథిలావస్థలో ఉండి ప్రమాదకరంగా మారిన భవనాలను తొలగించాలని సీఎం కేసీఆర్ మరియు రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు గ్రామ పంచాయతీ తీర్మానానికి అనుగుణంగా ప్రభుత్వ అధికారులు ఇచ్చిన సౌండ్ నెస్ సర్టిఫికెట్ తో మరియు అన్నిరకాల అనుమతులతో నిరుపయోగంగా శిదిలావస్థలో ఉన్న 2 పాఠశాల తరగతి గదులను మాత్రమే తొలగించామని... పల్లెప్రగతి గురించి వారికి తెలియదా ? అని అన్నారు. అదేవిదంగా పాఠశాల అవరణం మధ్యలోంచి వెళుతున్న కెనాల్ వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండ పైప్ లైన్ మరియు ప్రహరీ గోడ మంజూరు చేయించమని జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు స్కూల్ గ్రౌండ్ లోగాని చెరువు గట్టుపైనగాని తట్టెడు మన్ను పోయాలేదు కానీ పనికిరాని ప్రశ్నలు అనేకం అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండ అభివృద్ధికి అడ్డు పడితే ఉర్కునేది లేదని అన్నారు. అంతకముందే ఉదయం 10 గంటలకు గోపాలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జెడ్పి చైర్ పర్సన్ ఆకస్మికంగా సందర్శించి విద్య మరియు మధ్యాహ్న భోజనం






గుర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ దామోదర్ రావు, పి.ఏ.సి.ఎ చైర్మన్లు మైపాల్ రెడ్డి, సందీప్ రావు, వైస్ ఎంపీపీ ములసపు లక్ష్మి, సర్పంచ్ రౌతు జయ, ఉపసర్పంచ్ బుచ్చన్న, మండల పార్టీ అధ్యక్షులు సురేందర్ రావు, మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, వార్డు సభ్యులు గ్రామస్తులు, యువకులు, మరియు అధికారులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా కలెక్టర్ గా ఎం.వి రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది








భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ప్రజాపాలన :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సర కాలం పూర్తి చేసిన జిల్లా కలెక్టర్ డా ఎంవి రెడ్డి జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు పేదల ముంగిటకు ప్రభుత్వ పథకాలు చేర్చాలన్న లక్ష్యంతో పని చేసారు. కుగ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని పరిష్కరించారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా ప్రభుత్వం నూతన జిల్లాలో ఏర్పాటుతో ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 3 వ కలెక్టర్ గా డా ఎంవి రెడ్డి గత సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన పదవీ బాధ్యతలు చేపట్టారు. కరోనా వ్యాధి కష్ట కాలంలో నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టారు. మారుమూల గ్రామలున్న మన జిల్లాలో వ్యాధి నియంత్రణకు విశేషంగా కృషి చేసారు. గ్రామ గ్రామానికి వ్యాధి నియంత్రణకు పాటించాల్సిన సమాచారం అందించే విదంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీములు ఏర్పాటు చేశారు. మారుమూల గుత్తికోయ గ్రామాల్లో పర్యటించి వారితో మమేకమై సమస్యలు పరిష్కారం నకు చర్యలు చేపట్టారు. కరోనా నియంత్రణకు చేపట్టిన చర్యలకు జాతీయ స్థాయిలో స్కోచ్ పురస్కారం అందుకున్నారు. మెుబైల్ టీమ్స్ ఏర్పాటుతో గ్రామాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్, వరంగల్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా సెంట్రల్ ఆక్సినేషన్ ఏర్పాటు చేశారు. అత్యవసర కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరోనా, సీజనల్ వ్యాధులను దీటుగా ఎదుర్కొంటూనే గోదావరి వరదల నుండి ప్రజల రక్షణకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన, వసతి సౌకర్యాలు కల్పించి ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టారు. జిల్లాలో 67 వ్యవసాయ క్లస్టర్ లలో రైతు వేదికలు నిర్మించారు. వేదిక నిర్మాణాలను ప్రారంభించిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. 1271 పల్లె ప్రకృతి వనాలు, 481 వైకుంఠ దామాలు, డంపింగ్ యార్డులు నిర్మాణాలు చేపట్టి వ్యర్థాలు సేకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రహదారుల వెంబడి వ్యర్థాలు తొలగించి రహదారులకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటించారు. రానున్న హరితహారం కార్యక్రమానికి మొక్కల కొరత రాకుండా ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచు కార్యక్రమాన్ని చేపట్టారు. హరితహారం మొక్కల పెంపకాన్ని ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లు తో నిర్వహించిన సమావేశంలో అభినందించడం జరిగింది. రైతు పొలాలకు వెళ్ళడానికి రహదారుల సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గమనించి తక్షణం రహదారుల నిర్మాణం చేపట్టు విదంగా ఉపాధి హామీ పథకం నుండి నిధులు మంజూరు చేపించారు. జిల్లాలో ఈ సంవత్సర కాలంలో తనదైన. ముద్ర తో పరిపాలన సాగించి కలెక్టర్ అంటే ఇలా ఉండాలి అని ప్రజల మన్ననలు పొందారు.

## ఋణాల మంజూరి కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా మృత్యశాఖ అధికారి మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,ఫిబ్రవరి 3, ప్రజాపాలన :జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు, మత్స్య ఔత్సాహికులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన 2020-21 సంవత్సరమునకు గాను ఋణాలు మంజూరు చేయడం జరుగుతుందని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు మంచినీటి చేపల హేచరీలకు యూనిట్ విలువ రూ. 25 లక్షలు, చేపల పెంపకానికి పాండ్స్ నిర్మాణం రూ. 8.50 లక్షలు, రినర్క్యులేటర్ ఆక్వాకల్చరు సిస్టమ్ రూ. 25 లక్షలు, జలాశయములలో పంజరములలో చేపల పెంపకం రూ. 3 లక్షలు ఇన్సులేటేడ్ వాహనముల సరఫరా రూ. 20 లక్షలు, మూడు చక్రముల వాహనముల సరఫరా రూ. 3 లక్షలు, చిన్న తరహా చేప దాణా మిల్లుల ఏర్పటు రూ. 30 లక్షలు, మత్స్య విక్రయ కేంద్రముల ఏర్పాటు రూ. 10 లక్షలు ఋణాల మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు, ఇట్టి పథకంలో 40 శాతం సబ్సిడి, మహిళలకు, ఎస్సీ, ఎస్టీ లకు 60 శాతం సబ్సిడి మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. మత్స్యకారులు, మత్స్యకృషీవలులు, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాయం మంచిర్యాలలో ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తులు నమర్పించాలని కోరారు.

# పేద విద్యార్థినిని ఆదుకోండి






(మొదటి పేజీ తరువాయి)

ఐతే మొ దటి సంవత్సరం పూర్తి చేసుకున్న ఆ విద్యార్థినికి రెండవ సంవత్సరం ఫీజు కట్ట లేని పరిస్థితి ఎదురయ్యిం ది. ఆ విద్యార్థిని ఫీజు చెల్లించడానికి తల్లి మక్బుల్ జాన్ ఇంటి పై లోన్ కొరకు విశ్వప్రయత్నాలు చేసింది. కానీ అప్రూవల్ లేనందున ఏ బ్యాం కు లోన్ ఇవ్వడానికి ముందుకు రాలేదు. విదేశీ విద్యాదీవెన పథకం కింద సహాయం కొరకు 750 కిలో మీటర్ల దూరం స్కూటీపై ప్రయాణించి అమరావతి చేరుకొని ముఖ్య మంత్రికి తన గోడు వెళ్లబోసుకుందామన్న ప్రయత్నాలు విఫలం అయ్యాయి. చివరికి తిరిగి తిరిగి విసుగెత్తిన మక్బుల్ జాన్ కూతురు చదువు కొరకు ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించింది అని మాస్టర్ కీ ఛానల్ నియోజకవర్గ ప్రతినిధి సలీమా వీడియో సందేశం ద్వారా తెలుసుకున్న గూడూరి సీతామ హాలక్ష్మీ తనవంతు సహాయంగా 50,000 రూపాయలు ఫోన్ పే ద్వారా మక్బుల్ జాన్‌కి పంపిం చింది. ప్రభుత్వం, బ్యాంకులు స్పందించే లోపు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తల్లి,ఫిలిప్పీన్స్ లో ఉన్న కూతురు ప్రాణాలు ఏమైపోతాయో అని ఆమె అన్నారు. మానవత్వం కలిగిన ప్రతీ ఒక్కరూ మక్బుల్ జాన్ కు చేయూత నందించాలని గూడూరి సీతామహాలక్ష్మీ ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. ఆ విద్యార్థిని చదువుకొని సమాజంలో నలుగురికి సేవ చేసే అవకాశం కల్పించాల్సిందిగా, పైన తెలిపిన నంబర్ కు సహాయం చేయాలని సావిత్రి భాయ్ పూలే ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్ తరపున అందరికీ ఆమె విజ్ఞాపన చేశారు.

# సగానికి పడిపోయిన భూముల ధరలు

**విజయవాడ, ఫిబ్రవరి 3 (ప్రజాపాలన) :** రాజధాని అమరావతి ప్రాంతంలో భూముల ధరలు పూర్తిగా పడిపోయాయి. గత కొద్దినెలలుగా ఇక్కడ క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. 2020 సంవత్సరంలో ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఒకవైపు మూడు రాజధానుల ప్రకటన, మరోవైపు కోవిడ్ తో పూర్తిగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తమ భూములు బంగారమని, అమ్ముకోకుండా ఉంచుకున్న వాళ్లు నేడు లబో దిబో మంటున్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించింది. దీంతో ఇక్కడ భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రధానంగా గుంటూరు, విజయవాడల మధ్య ఉన్న భూమి బంగారమయిపోయింది. దీంతో గజం ధర యాభై వేలకు పైగానే పలికింది. దీంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా వెలిశాయి. పెద్ద పెద్ద వెంచర్లను వేశాయి. జాతీయ రహదారికి ఇరువైపు విజయవాడ ? గుంటూరు మధ్య ఎన్నో అపార్ట్ మెంట్లు వెలిశాయి. అయితే మూడు రాజధానుల ప్రతిపాదనతో ఇక్కడ ధరలు పూర్తిగా పడిపోయాయి. రియల్ ఎస్టేట్ సంస్థలు ధరలు తగ్గించి ఆఫర్లు ప్రకటించినా కొనుగోళు లేవు. దీంతో అనేక అపార్ట్ మెంట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దాదాపు పథ్నాలుగు నెలల నుంచి ఎటువంటి బేరాల్లేవని రియల్ ఎస్టేట్ సంస్థలు చెబుతున్నాయి. తాము బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పునకు వడ్డీ కూడా చెల్లించలేక పోతున్నామని చెబుతున్నారు. తాజాగా ప్రభుత్వం అమరావతి నుంచి పరిపాలన రాజధానిని విశాఖకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుంది. మరో రెండు మూడు నెలల్లోనే రాజధాని తరలిపోతుందని వైసీపీ ముఖ్యనేతలే ప్రకటనలు చేస్తున్నారు. దీంతో భూముల ధరలు మరింత దిగజారిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతుంది. యాభై వేలు పైచిలుకు పలికిన గజం ధర ఇప్పుడు 14 వేలకు ఇస్తామన్నా కొనే వారు లేరు. రిజిస్ట్రార్ కార్యాలయాలు కూడా వెలవెల పోతున్నాయి. మొత్తం మీద రాజధాని అమరావతి ప్రాంతంలో భూముల ధరలు కొత్త ఏడాది కూడా పుంజుకునే అవకాశాలు కన్పించడం లేదు.

## భాజపాపై పోరాటానికి కాంగ్రెస్‌లో చేరతా

(మొదటి పేజీ తరువాయి)

గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, హోఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగానూ వ్యవహరించారు. 2017 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. రెండేళ్ల తర్వాత శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. కొన్ని విభేదాలు రావడంతో గతేడాది జూన్‌లో ఆ పార్టీకి సైతం రాజీనామా చేసి పీఎస్‌డీపీని ఏర్పాటు చేశారు. ( కోసమెరుపు: వాఘేలా ప్రకటనకు ముందు ఆయన మళ్లీ కాంగ్రెస్‌లో చేరతారంటూ చెలరేగిన ఊహాగానాలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. తమ పార్టీ నేతలెవరినీ ఆయన సంప్రదించలేదని పేర్కొంది.)

# నేతల్లో కనిపించని హుషారు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ప్రజాపాలన) :** సహజంగా ఏ రాష్ట్రంలోనైనా పార్టీ బలంగా ఉండాలంటే అక్కడ నాయకత్వం బలంగా ఉండాలి. నాయకుడు బలంగా ఉంటేనే అక్కడ పార్టీ బలంగా ఉంటుంది. కాంగ్రెస పార్టీ తొలి నుంచి చేస్తున్న తప్పు ఆ పార్టీ కొంప ముంచేట్లు ఉంది. ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ గాంధీ కుటుంబంలో ఎవరైనా సరే రాష్ట్రంలో బలమైన నాయకుడిని ఎవరినీ ఎదగనివ్వరు. అయితే ఇందిరకు ఉండే ఇమేజ్ తో కొన్ని ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయగలిగింది. కానీ సోనియా గాంధీ హయాంలో మాత్రం కాంగ్రెస్ మరింత బలహీనం కావడానికి రాష్ట్రాల్లో నాయకత్వ లోపమే కారణమని చెప్పాలి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకుడు కారణంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రెండు సార్లు పార్టీ అధికారంలోకి రాగలిగింది. అటువంటిది ఆయన తనయుడు జగన్ ను దూరం చేసుకున్న తర్వాత ఇప్పుడు పార్టీకి నాయకత్వ సమస్య ఏర్పడింది. ఇక కర్ణాటకలోనూ సిద్ధరామయ్య ఒంటిచేత్తో పార్టీని నడుపుతున్నారు. ఆయనను తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ కు నాయకత్వం లేదు. తమిళనాడును తీసుకుంటే అక్కడ చిదంబరం వంటి నేతలున్నా కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడే కనపడతారు. తమిళనాడు రాజకీయాలను పట్టించుకోరు. అటువంటి వారినే కాంగ్రెస్ ప్రోత్సహిస్తుంది. ఇప్పుడు అక్కడ డీఎంకే దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వస్తుంది. ఇక పశ్చిమ బెంగాల్ లోనూ అంతే. బలమైన నేతగా భావించి మమత బెనర్జీని కాంగ్రెస్ దూరం పెట్టింది. దీంతో ఆమె వేరే పార్టీ పెట్టుకుని రెండు సార్లు అధికారంలోకి రాగలిగారు. కేరళలోనూ అంతే. ఉమెన్ చాందీ వంటి నేతలున్నా ఫైర్ బ్రాండ్ లుగా పేరుపడిన నేతలు ఎవరూ లేరు. ఉత్తర్ ప్రదేశ్ లోనూ అంతే. సరైన నాయకుడు లేకపోవడంతో ప్రియాంక గాంధీని రంగంలోకి దించాల్సి వచ్చింది. చరిష్మా, ప్రజల్లో పట్టున్న నేతకు పార్టీ పగ్గాలు అప్పగిస్తేనే కాంగ్రెస్ రాష్ట్రాల్లో పుంజకుంటుందన్న విషయం అనేక సార్లు రుజువయినా, పార్టీ అధిష్టానం మాత్రం పట్టించుకోదు. ఇదే అసలు సమస్యగా మారింది. దీంతో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ కన్పించకుం డా పోయింది. ఇప్పటికైనా బలమైన నాయకుడిని ముందు తాము నమ్మి జనంలోకి పంపాలన్నది క్యాడర్ కోరుకుంటుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ హైకమాండ్ ఆ దిశగా ఆలోచిస్తేనే తిరిగి పార్టీకి పూర్వ వైభవం దక్కుతుంది.

# జుంటా చేతుల్లోకి మయన్మార్



**నేపిదా, ఫిబ్రవరి 3 (ప్రజాపాలన) :** మయన్మార్ పాలన మరోసారి సైనిక జుంటా చేతుల్లోకి వెళ్లిపోయింది. దేశం ఏడాది పాటు సైన్యం ఆధీనంలో ఉంటుందని సైన్యం ఆధీనంలోని 'మ్యావద్దీ'టీవీ సోమవారం ప్రకటించింది. దేశ కీలక నేత, కౌన్సిలర్ హోదాలో ఉన్న అంగ్‌సాన్ సూకీ(75) సహా సీనియర్ రాజకీయ నేతలను గృహ నిర్బంధంలో ఉంచినట్లు తెలుస్తోంది. ఏడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల సమయంలో ఓటరు జాబితాలో అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం కావడం, కరోనా సంక్షోభ సమయంలో ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేయలేకపోయినందునే అధికారం చేజిక్కించుకుంటున్నట్లు 'మ్యావద్దీ'తెలిపింది. కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ జనరల్ మిన్ ఔంగ్ హ్లాయింగ్ దేశంలో అత్యవసర పరిస్థితి విధించారని తెలిపింది. దేశ సుస్థిరతకు ప్రమాదం వాటిల్లినందున, ప్రభుత్వ కార్యకలాపాలన్నీ కమాండర్ ఇన్ చీఫ్‌కు బదిలీ అయ్యాయని పేర్కొంది. సోమవారం ఉదయం నుంచి కొత్తగా ఎన్నికైన సభ్యులతో పార్లమెంట్ సమావేశాలు మొదలు కావాల్సిన సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. వేకువజాము నుంచే రాజధాని నేపిదాతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ టెలివిజన్ ప్రసారాలు, ఫోన్, ఇంటర్నెట్ వంటి సమాచార సంబంధాలను నిలిపివేశారు. దేశ అగ్రనేత, కౌన్సిలర్ హోదాలో ఉన్న అంగ్‌సాన్ సూకీ, అధ్యక్షుడు విన్ మియింత్‌లను గృహ నిర్బంధంలో ఉంచినట్లు ఎన్‌ఎల్‌డీ ప్రతినిధి తెలిపారని ఆన్‌లైన్ మీడియా వెల్లడించింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, ప్రాంతీయ కేబినెట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖు లను కూడా సైనిక పాలకులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ జనరల్ మిన్ ఔంగ్ హ్లాయింగ్ సారథ్యంలో తాత్కాలిక అధ్యక్షుడిగా మింట్ స్వే ఉంటారని మిలటరీ టీవీ తెలిపింది. ఏడాదిలో ఎన్నికలు జరిపి, గెలిచిన వారికి అధికారం అప్పగిస్తామని ప్రకటించింది. దీనిపై సూకీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ(ఎన్‌ఎల్‌డీ) ఒక ప్రకటన విడుదల చేసింది. 'సైనిక జుంటా చర్య అక్రమం, రాజ్యాంగానికి, ప్రజల అభీష్టానికి వ్యతిరేకం. సైనిక తిరుగుబాటును, నియంతృత్వ పాలనను వ్యతిరేకించాలి'అని కోరింది. అయితే, ఈ పోస్టును ఎవరు పెట్టారో తెలియరాలేదు. ఎన్‌ఎల్‌డీ నేతలెవరూ ఫోన్‌కాల్స్‌కు సమాధానం ఇవ్వడం లేదు. దేశీయ విమాన సర్వీసులన్నిటినీ రద్దు చేస్తున్నట్లు యంత్రాంగం తెలిపింది. దేశంలోని అతిపెద్ద యాంగూన్ విమానాశ్రయాన్ని మూసివేశారని మయన్మార్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం తెలిపింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు ఐదు దశాబ్దాల పాటు సైనిక పాలన కొనసాగడం, 1962 నుంచి అంతర్జాతీయంగా ఏకాకిగా మారడం.. 2015లో ఎన్నికలు జరిగి, ప్రజాస్వామ్యం దిశగా అడుగులు పడుతున్న నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామం దేశ భవిష్యత్తును మరోసారి ప్రశ్నార్థకంగా మార్చాయి. ప్రజాస్వామ్యం కోసం అనేక ఏళ్ల పాటు గృహ నిర్బంధంలో గడిపిన, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సూకీని సైనిక జుంటా అధికారం నుంచి తొలగించి తిరిగి నిర్బంధంలోకి పంపడంతో ప్రపంచ దేశాలు షాక్‌కు గురయ్యాయి. మయన్మార్‌లో సైన్యం రాజకీయ నేతలను నిర్బంధించడంపై అమెరికా విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్ స్పందించారు. అక్కడ నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. 'నిర్బంధంలో ఉంచిన రాజకీయ నేతలు, ప్రభుత్వాధికారులను సైనిక పాలకులు వెంటనే విడుదల చేయాలి. ప్రజాభీష్టానికి లోబడి వ్యవహరించాలి'అని కోరారు. మయన్మార్‌తో బలమైన ఆర్థిక సంబంధాలు నెరపుతున్న పొరుగు దేశం చైనా ఆచితూచి స్పందించింది. అక్కడ జరుగుతున్న పరిణామాలపై పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపింది. రాజకీయ పార్టీల నేతలు తమ మధ్య విభేదాలను రాజ్యాంగానికి లోబడి పరిష్కరించుకోవాలంది. మయన్మార్‌లో పరిణామాలు ప్రజాస్వామ్య సంస్కరణలకు తీవ్ర విఘాతం కలిగించేవిగా ఉన్నాయని ఐక్యరాజ్యసమితి చీఫ్ గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేశారు. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో సూకీకి చెందిన ఎన్‌ఎల్‌డీ ఘన విజయం సాధించగా సైన్యం మద్దతు ఉన్న ప్రతిపక్ష యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ ఓటమి పాలు కావడం గమనార్హం. సైనిక తిరుగుబాటుకు అవకాశాలున్నాయంటూ గత కొన్ని రోజులుగా వస్తున్న ఊహాగానాలు నిజమేనని దీంతో తేలిపోయింది. దేశ రాజ్యాంగంలోని కొన్ని నిబంధనలు.. అత్యవసర పరిస్థితుల్లో పాలనా బాధ్యతలను సైన్యం హస్తగ తం చేసుకునేందుకు వీలు కల్పి స్తున్నాయని సైనిక నేతలు సమర్థిం చుకుంటున్నారు. అయితే, ఇది సైనిక తిరుగుబాటు కిందికే వస్తుం దని విశ్లేషకులు అంటున్నారు. ఎన్నికల్లో తాము మద్దతిచ్చిన రాజకీయ పార్టీలు ఓటమి పాలుకావడం జీర్ణించుకోలేకే సైనిక నేతలు ఈ క్లాజ్‌ను ఉపయోగించుకున్నారని చెబుతున్నారు. అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని గద్దె దింపడంతో సైనిక పాలన మద్దతుదారులు, ప్రతిపక్ష పార్టీల శ్రేణులు యాంగూన్‌లో ర్యాలీలు చేపట్టాయి.

ప్రజాపాలన


సంపాదకీయం

గురువారం 04, ఫిబ్రవరి 2020

# మూఢ నమ్మకాల పురోగతి!

మతం అనేది మానవతకు, మనశ్శాంతికి దోహదపడే విధంగా ఉండాలి. విశ్వాసం అంధ విశ్వాసంగా, నమ్మకం మూఢనమ్మకంగా మారితే ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది. చిత్తూరు జిల్లా మదనపల్లెలో తోబుట్టువులయిన ఇద్దరు యువతుల హత్యోదంతమే అందుకు ఒక తార్కాణం. ఈ విషాద ఘటన, ఆన్‌లైన్ షాపింగ్‌లో మంత్ర పూజల సామగ్రి లభ్యత వర్తమాన నవీన నాగరికతలోని వైరుధ్యాలను వెల్లడించడం లేదా? గ్రహాంతర యానంలో భారతదేశం వడివడిగా పురోగమిస్తోంది. అచిరకాలంలోనే భారతీయుడు ఒక చంద్రుడిపై కాలు మోపనున్నాడు. మరి ఈ నవీన యుగంలోనూ భారత్‌లోని ఒక ప్రఖ్యాత విశ్వవిద్యాలయం భూతవైద్యం కోర్సును నిర్వహించనున్నట్లుగా ప్రకటించింది! మరి మతం ప్రధాన భూమిక వహిస్తున్న గల్ఫ్ దేశాలలో మంత్రాలు, మూఢనమ్మకాల విషయాన్ని చూద్దాం. అరబ్బీ భాషలో తాయెత్తులను తిలిస్మా, మంత్రాలను సహరా అని అంటారు. అరబ్ ప్రజలపై ఆఫ్రికా మంత్రాల ప్రభావం అంతా ఇంతా కాదు. 1920లో అమెరికాలో విద్యనభ్యసించి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన ఫారూఖీ, యునానీ వైద్యం ఆధారంగా ఒక ఔషధ పరిశ్రమ నెలకొల్పాడు. ఆఫ్రికా నల్లనయ్య బొమ్మ ఆ పరిశ్రమకు చిహ్నం. ఆ సంస్థ ఉత్పత్తే జిందా తిలిస్మాత్. దీని అర్థం జీవ మంత్రం. జిందా తిలిస్మాత్ అనేది ఇప్పటికీ ఒక సుప్రసిద్ధ బ్రాండ్. పేరులో ఉన్న తిరకాసు కారణాన జిందా తిలిస్మాత్‌ను దిగుమతి చేసుకోవడానికి ఒక దశలో గల్ఫ్ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అయితే మంత్రాలకు, ఈ ఔషధానికి సంబంధం లేదని వివరణ ఇవ్వడంతో అనుమతించారు. దిష్టి ఆచారాన్ని, దెయ్యాలు, మంత్రాలను అరబ్బులు పూర్తిగా విశ్వసిస్తారు. నేర పరిశోధనలో గల్ఫ్ పోలీసులు శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భూతశక్తిని కూడా వినియోగిస్తారని చెబుతారు. ఇక్కడ రంగురాళ్ళ విక్రయం ఒక లాభదాయక వ్యాపారం. తమకు తెలిసిన బంధుమిత్రులకు అరబ్బులు ప్రేమగా ఇచ్చే బహుమతి రంగురాళ్ళ ఉంగరాలు మాత్రమే. ఫుట్‌బాల్ పోటీల సందర్భంగా మంత్రాల కారణంగా తాము ఓడిపోయామంటూ చెప్పిన జట్లు కూడా ఇక్కడ ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. రాత్రిపూట దయ్యాలు సంచరిస్తాయనే ఉద్దేశంతో పాఠశాలల్లో దయ్యాలు రాకుండా ఉండేందుకు అన్ని ట్యూబులైట్లను వేసి ఉంచుతారు. వాచ్‌మెన్ పహరా సరేసరి. గల్ఫ్ దేశాలలో మంత్రపూజలు, భూతవైద్యానికి చట్టబద్ధమైన గుర్తింపు ఉంది. వాటి నియంత్రణ వ్యవస్థ కూడా ఉందని తెలిస్తే ఆశ్చర్యం కలుగకమానదు. మంత్రపూజలు చేసే విధానంలో కూడా వర్గీకరణ ఉంది. దానికి తగినట్లుగా చట్టవిరుద్ధంగా చేసే మంత్రపూజలకు సంబంధించిన సామగ్రిని దేశంలోకి తీసుకురాకుండా చూసేందుకు కస్టమ్స్ అధికారులు సదా పకడ్బందీగా చర్యలు చేపడుతుంటారు. చట్టబద్ధంగా చేసే భూతవైద్యాన్ని ప్రభుత్వం డేగకన్నుతో గమనిస్తుంటుంది. గల్ఫ్ దేశాలలోని సిఐడి విభాగాలలో దీనికి సంబంధించి ప్రత్యేక విచారణ విభాగాలు ఉన్నాయి. గల్ఫ్ దేశాలలో కుటుంబ కలహాలు ఎక్కువ కాబట్టి విడాకుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. చాలామంది దంపతులు మూఢవిశ్వాసంతో మంత్రగాళ్ళను ఆశ్రయించడం కద్దు. తమ ఇళ్ళలో ఆయాలుగా పని చేసే విదేశీ మహిళలు ఈర్ష్యతో తమ కుటుంబాలపై మంత్రాలు చేయిస్తారని అనేక మంది విశ్వసిస్తారు. అందుకే ఆయాల పట్ల వారు ప్రవర్తించే తీరు మరోరకంగా ఉంటుంది. భారతదేశంలో బాబాలు, స్వాములు చేసినట్లుగా ఇక్కడ కూడా శేఖులు కొందరు మంత్రాల పేరిట మోసాలు చేస్తుంటారు. మరికొందరు ఎలాంటి లాభాపేక్ష లేకుండా చట్టబద్ధ మంత్రాలను చదువుతారు. క్షుద్రపూజలు మాత్రం పూర్తిగా నిషేధం. భారత్ నుంచి కొందరు స్వాములు, బాబాలు కూడ సందర్శక వీసాలపై గల్ఫ్ దేశాలకు వచ్చి తమ భారతీయ ఖాతాదారులకు సేవలు అందించి వెళతారు. ఆధునిక విజ్ఞానంతో పాటు మూఢత్వ భావజాలం కూడా పురోగతి సాధిస్తుండడం బాధాకరం.

# ఎన్నికల రాష్ట్రాలకే అన్ని నిధులూ!




సుమారు 34 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను భారత పార్లమెంటులో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ సొంత పార్టీ వారి అంచనాలను కూడా అందుకోలేకపోయారు. దేశంలో 28 రాష్ట్రాలు, 9 కేంద్రపాలిత ప్రాంతాలు ఉండగా కేవలం నాలుగు ఐదు రాష్ట్రాల బడ్జెట్ గానే ఇది మిగిలిపోనుంది. రానున్న రెండు మూడు నెలల్లో ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ప్రయోజనాలకు మాత్రమే బడ్జెట్‌లో పెద్దపీట వేసారు. మొత్తం బడ్జెట్‌లో సుమారు మూడు లక్షల కోట్ల రూపాయలను కేవలం ఈ ఐదు రాష్ట్రాలకే కేటాయించారు. మిగతా దేశం ఎటు పోయినా సరే అనుకుంటూ తమ రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే పెద్ద పీట వేశారు. తెలుగు రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలకు నయా పైసా కూడా న్యాయం చేయకుండా మా వైఖరి ఇదే అని మొండిగా ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలకు ఏడేళ్ల క్రితం ఇచ్చిన విభజన హామీలు ఇప్పటికీ ఒక్కటి కూడా అమలు కాలేదు. కానీ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ అధికార పార్టీలైన టిఆర్ఎస్, వైసీపీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. రేపటి ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాల్లో గెలుస్తామని ప్రగల్భాలు పలుకుతున్నది. ఇప్పటికే తెలంగాణలో 2019 పార్లమెంటు ఎన్నికలలో నాలుగు పార్లమెంటు స్థానాలు గెలుచుకున్న బీజేపీ గత ఒకటిన్నర ఏడాదిగా రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీలేదు. కేంద్రప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇస్తున్నామని అడ్డగోలుగా అబద్ధాలు మాత్రం చెబుతున్నది. తెలంగాణ మెట్రో రైలు విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు మంజూరు, విభజన హామీల్లో పేర్కొన్న బయ్యారం ఉక్కు కర్మాగారం, వరంగల్ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఇలాంటివేవీ ఈ బడ్జెట్‌లో కనీస ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. ఈ దశలో కాళేశ్వరం తాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం అనేది ఒక కలగానే మిగిలి పోతుంది. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే కడప ఉక్కు కర్మాగారం నుంచి మొదలుకొని విజయవాడ, విశాఖపట్నం రైల్వే జోన్లు, పోలవరానికి అధిక నిధులు వంటి అంశాలేవీ ప్రస్తావనకు కూడా రాలేదు. కేవలం ఖరగ్‌పూర్%--%విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ హైవే గురించి మాట్లాడి ఊరుకున్నారు. అది ఎప్పుడు మొదలవుతుందో ఏనాటికి పూర్తవుతుందో తెలియదు. మొత్తం మీద బడ్జెట్‌ను విశ్లేషిస్తే ఆరోగ్య రంగానికి పోయినసారి కంటే 137 శాతం నిధులు కేటాయించటం ఒక్కటీ ఆహ్వానించదగ్గ విషయం. గత బడ్జెట్‌లో 90 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఆరోగ్య రంగానికి కేటాయిస్తే ప్రస్తుతం రెండు లక్షల 10 వేల కోట్ల రూపాయల కేటాయించడం మంచిదే. అందులో 35 వేల కోట్ల రూపాయలు దేశమంతా ప్రజలకు కరోనా వ్యాక్సిన్ వేయడానికి కేటాయించారు. కేంద్ర బడ్జెట్ ఇటు ప్రతిపక్షాలు అంటున్నట్లు అంకెల గారడీ కాదు, అటు అధికారపక్షం భుజాలు చరుచుకుంటున్నట్లు అద్భుతమూ కాదు. ఈ కరోనా కష్టకాలం తర్వాత వచ్చిన బడ్జెట్‌ను ఊహించడానికి ఇంతకన్నా ఏమీ లేదు.

## కనీస వేతనాలు లేని 'సఫాయి'లు

సఫాయి కార్మికుల జీవితాలు సాఫీగా సాగడం లేదు. కనీస వేతనాలు కొరవడిన అభాగ్యులు వీరు. మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని జీతాలతో బతుకు బండిని కష్టాలతో ఈడ్చుతున్నారు. కార్మిక చట్టాలు ఎన్ని ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాలను కాగితాలకే పరిమితం చేస్తున్నాయి. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సఫాయి కార్మిక వర్గం వాపోతోంది. కార్మిక చట్టాల ప్రకారం సఫాయి కార్మికులకు కనీసవేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో సహా కనీస వేతనం 24వేలకు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. తెలంగాణ పట్టణాలు, నగరాల్లో రోజుకు ఇంచుమించు లక్ష మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థ పదార్థాలు ఉత్పన్నమవుతాయి. సఫాయి కార్మికులు వేలాది కిలోమీటర్ల రోడ్లు ఊడ్చగా వచ్చిన చెత్త, మురుగు కాలువలను శుభ్రపర్చగా వెలువడిన వ్యర్థం అంతే మొత్తంలో ఉంటుంది. పారిశుద్ధ్య వ్యవస్థకు, నాగరికతకు అవినాభావ సంబంధం ఉంది. పారిశుద్ధ్యం మీద ప్రభుత్వాలు ఖర్చు పెట్టే ప్రతి పది రూపాయలకు 9 రూపాయలు మళ్ళీ లభిస్తాయి. ఎందుకంటే పారిశుద్ధ్యం మీద ఖర్చు పెట్టడం అంటే ప్రజల ఆరోగ్య వసతుల మీద ఖర్చు పెడుతున్నట్టే. అనారోగ్యాలు, అంగ వైకల్యాలు తగ్గి, పౌరులు ఆరోగ్యవంతులుగా వర్ధిల్లుతారు. మరి వ్యర్థాలను తొలగించే సఫాయి కార్మికుల బ్రతుకులు ఎప్పుడూ దారిద్ర్యంలో కునారిల్లడం నాగరికతకే నగుబాటు కాదూ? కనపడే శత్రువులను ఎదుర్కొనే సైనికులకు సకల సదుపాయాలు, గౌరవం లభిస్తుంటే (దానికి వారు పూర్తి అర్హులు) తమ ప్రాణాలు పణంగా పెట్టి అనునిత్యం ఈ దేశాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే సఫాయి కార్మికులను అంటరానివారిగా చిన్నచూపుతో చూస్తూ తక్కువ జీతం ఇస్తున్నారు! ఈ పరిస్థితి మారాలి.

# ప్రైవేటీకరణే ప్రగతి మంత్రమా?

కొత్తబడ్జెట్ వచ్చింది. కుబేరులు సంతోషించారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలో అనేకమంది పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలకు సంతృప్తికరంగా ఉంది. బడ్జెట్‌పై వారి వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. బ్యాంకులను, బీమా సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రభుత్వ ఆస్తులను అమ్మడం, బీమారంగంలో విదేశీ పెట్టుబడులను 74 శాతానికి పెంచడం, మొండి బాకీలకోసం ఒక ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలు స్టాక్ మార్కెట్ ఉత్థానానికి దారితీశాయి. ప్రభుత్వం క్రమంగా వివిధ రంగాల నుంచి తప్పుకుని ప్రైవేట్ రంగానికి మరింత పాత్ర కల్పించాలన్న విషయంలో మోదీ సర్కార్ తన ఉద్దేశాలను ఎప్పుడూ దాచుకోలేదు. నీతి ఆయోగ్ పలు నివేదికల్లో ఈ విషయం స్పష్టంగా కనపడుతుంది. 15వ ఆర్థిక సంఘం నివేదిక సైతం గ్రామాల్లోకి మార్కెట్ చొచ్చుకువెళ్ళాలన్న ఉద్దేశాన్ని ప్రకటించింది. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త సాగు చట్టాలు వ్యవసాయరంగం రూపురేఖలు మారుస్తాయని, గ్రామాల్లో ప్రైవేట్ రంగం పెట్టుబడులు పెట్టడమే సమస్యలకు తగిన పరిష్కారమని పేర్కొంది. 1991లో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రారంభమైన సంస్కరణలు ఇవాళ ఒక మౌలిక మలుపు తీసుకుంటున్నాయి. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రూ. 9,961 కోట్ల మేరకు ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. కేవలం మైనారిటీ వాటాలనే ఉపసంహరించడాన్ని పీవీ అనుమతించారు. వాజపేయి హయాంలో పెట్టుబడుల ఉపసంహరణ ఒక వెల్లువలా సాగింది. పెట్టుబడుల ఉపసంహరణకు అరుణ్ శౌరీ నేతృత్వంలో ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేసి, విదేశ్ సంచార్ నిగమ్, మారుతి సుజుకి, ఓఎన్‌జీసీ, బాల్కో, హిందుస్తాన్ జింక్ మొదలైన కంపెనీలలో భారీ ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు ఆయన ఆమోద ముద్ర వేశారు. ప్రభుత్వ రంగంలోని హోటళ్లను పూర్తిగా అమ్మి వేశారు. ప్రభుత్వ బ్యాంకులన్నిటిలోనూ 33 శాతం వాటాలను అమ్మాలని అప్పుడే ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ప్రతిపాదించారు కాని అది అమలు కాలేదు. వాజపేయి హయాంలో రూ. 33,655 కోట్ల మేరకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. వామపక్షాలు అడ్డుకోవడం వల్ల యూపీఏ మొదటి ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం వేగవంతం కాలేదు. ఆ తొలి అయిదేళ్లలో కేవలం రూ. 8,515 కోట్ల మేరకే పెట్టుబడులను ఉపసంహరించగలిగారు. అయితే యూపీఏ రెండవ సారి మళ్లీ అధికారంలోకి రాగానే ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణను ప్రధాని మన్మోహన్ సింగ్ వేగవంతం చేశారు. ఎన్‌హెచ్‌పిసితో ప్రారంభమైన పెట్టుబడుల ఉపసంహరణ వివిధ రంగాల్లోకి విస్తరించి దాదాపు రూ. 99,000 కోట్ల మేరకు సాగింది. మన్మోహన్ సింగ్ రెండవ సారి ప్రధాని అయినప్పుడు వాల్ స్ట్రీట్ జర్నల్ ఆయనను ఇంటర్వ్యూ చేసి ప్రైవేటీకరణ గురించి ప్రశ్నించింది. ప్రభుత్వరంగ సంస్థలు మార్కెట్‌లో ఇతర ప్రైవేట్ సంస్థలతో సమానంగా పోటీపడాలని, మంచి లాభాలను ఆర్జించాలన్నదే తమ ఉద్దేశమని, అవి పెట్టుబడులకోసం మార్కెట్‌లో ప్రవేశిస్తే తమకు అభ్యంతరం లేదని మన్మోహన్ అన్నారు. అసలు ప్రైవేటీకరణ తమ సిద్ధాంతం కాదని అవసరాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించుకుంటామనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ సైద్ధాంతిక విశ్వాసాలలో ప్రైవేటీకరణ చాలా ముఖ్యమైనది. ఆయన రెండవ సారి ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ విషయం మరింత స్పష్టమవుతోంది. వాజపేయి కన్నా మోదీ రెండాకులు ఎక్కువ చదివారు. మోదీ తొలి ప్రభుత్వ కాలంలోనే రూ. 2లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాజా బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం జాతీయ హైవే అథారిటీ, రైల్వే, చమురు, సహజవాయు సంస్థల ఆస్తులను అమ్మి రు. 1.74 లక్షల కోట్లను సేకరిస్తామని ప్రకటించింది. మొత్తం ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ ప్రైవేటీకరణ చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అణు ఇంధనం, అంతరిక్షం, రక్షణ, రవాణా, టెలికమ్యూనికేషన్లు, విద్యుత్, పెట్రోలియం, బొగ్గు, ఖనిజవనరులు, బ్యాంకింగ్, మైనింగ్, ఆర్థిక సర్వీసుల్లో ప్రభుత్వం నామమాత్రంగా కొనసాగుతుందని ఆమె చెప్పారు. ఆస్తుల అమ్మకం ద్వారా సేకరించిన ఈ మొత్తాన్నంతా మౌలిక సదుపాయాల అభివృద్ధికి మళ్లించడం వల్ల పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరుగుతుందని నిర్మల నొక్కి చెప్పారు. నిజంగా మోదీ ప్రభుత్వం సేకరించిన నిధులన్నీ మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడుతున్నాయా అన్న విషయం చర్చనీయాంశమే. మౌలిక సదుపాయాల కల్పన కోసం మోదీ ప్రభుత్వం 2018లో రూ. 2.18 లక్షల కోట్ల మేరకు 42 రకాల సెస్‌ను విధించింది, స్వచ్ఛభారత్ సెస్, రోడ్ సెస్, క్లీన్ ఎనర్జీ సెస్ అంటూ రకరకాలుగా వసూలు చేసిన ఈ మొత్తాన్ని ఆయా రంగాలకు బదిలీ చేయకపోవడమే కాక సరిగా వినియోగించలేదని కూడా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) విమర్శించింది. 2019లో ఈ సెస్ మొత్తం రూ. 3.60 లక్షల కోట్లకు చేరుకుంది. జీఎస్టీ నష్టపరిహార సెస్ క్రింద వసూలు చేసిన రూ. 47,277 కోట్లను కూడా చాలాకాలం నష్టపరిహార నిధికి కాకుండా కన్సాలిడేటెడ్ ఫండ్‌కు మళ్లించింది. క్రూడ్ ఆయిల్ సెస్ క్రింద సేకరించిన రూ. 1.24 లక్షల కోట్లను కూడా సంబంధిత రిజర్వు నిధికి మళ్లించలేదు. తన రెవిన్యూను పెంచుకోవడానికి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సెస్‌ను విధించడం పరిపాటి అయింది. ఇప్పుడు బడ్జెట్‌లో వ్యవసాయ, మౌలిక సదుపాయాల కోసం రూ. 30 వేల కోట్ల మేరకు సెస్‌ను విధించాలని నిర్ణయించారు. విచిత్రమేమంటే 15వ ఆర్థిక సంఘం దీని గురించి ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. అతిగా సెస్‌లు, సర్‌ఛార్జిలు కేంద్రం వసూలు చేసి తానే ఉపయోగించుకుంటోందని, ఆ మొత్తంలో కూడా తమకు సగం వాటా ఇవ్వాలని రాష్ట్రాలు కోరినట్లు ఆర్థిక సంఘం చెప్పింది. అయితే మోదీ ప్రభుత్వానికి ఆ ముక్క సిఫారసు చేసే సాహసం చేయలేదు. కేంద్రం తన రెవిన్యూను పెంచుకునేందుకే సెస్ వసూలు చేస్తుంది కాని, రాష్ట్రాలతో పంచుకునే అవకాశం లేదని 14వ ఆర్థిక సంఘం సభ్యుడు గోవిందరావు అన్నారు. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న పేరుతో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల్నీ, బ్యాంకుల్ని, బీమా కంపెనీలను అమ్మడం సరైనది కాదని సంఘ్ పరివార్‌కు చెందిన స్వదేశీ జాగరణ్ మంచ్ కూడా విమర్శించింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ఆందోళనకరమని ఆ సంస్థ ప్రతినిధి అశ్వినీ మహాజన్ ప్రకటన విడుదల చేశారు. ఈ సంస్థల్లో ముందుగా వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టి, పనితీరు మెరుగుపరిచేందుకు ప్రయత్నించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు చెల్లించిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను అమ్మడం సరైంది కాదని బీమారంగంలో విదేశీ పెట్టుబడులను 74 శాతానికి పెంచడం వల్ల మన ఆర్థిక వనరులపై విదేశీ ఆధిపత్యాన్ని పెంచినట్లవుతుందని మహాజన్ విమర్శించారు. పార్లమెంట్‌లో సోమవారం నాడు బడ్జెట్ ప్రవేశపెట్టేంతవరకూ ఊరుకున్న ప్రతిపక్షాలు అనుకున్న విధంగానే సాగుచట్టాలను వెనక్కి తీసుకోవాలంటూ మంగళవారం ఉభయ సభల్లో గందరగోళం సృష్టించాయి. ఢిల్లీ సరిహద్దుల్లో గత 70 రోజులుగా జరుగుతున్న రైతుల నిరసనలు ఆగకపోగా, ఢిల్లీ నగరాన్ని భద్రతా వలయం మధ్య పూర్తిగా దిగ్బంధనం చేయాల్సి వచ్చింది. ప్రతికూల వాతావరణం ఎంతగా ఎదురైనప్పటికీ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణలో మోదీ సర్కార్ మరింత సాహసంగా ముందుకు వెళ్లడం వల్ల కలిగే పర్యవసానాల గురించి ఇప్పుడే చెప్పడం కష్టం. సంఘ్ పరివార్ చెప్పినా ఆయన వినే పరిస్థితుల్లో లేరు. మరి ప్రభుత్వం అన్ని రంగాలనుంచీ క్రమంగా తప్పుకుంటున్నప్పుడు కేంద్ర మంత్రివర్గంలో 54 మంది అమాత్యులు, ఒక్క ప్రధానమంత్రి కార్యాలయంలోనే 44 మంది అధికారులు అవసరమా అన్న విషయం కూడా ఆలోచించాలి.



# పట్టభద్రులు బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విలేకర్ల సమావేశం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల ప్రజాపాలన :వరంగల్ ,ఖమ్మం, నల్లగొండ శాసనమండలి పట్టభద్రులు నియోజకవర్గ బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు మూడు వేల రూపాయలు ఇస్తానని చెప్పి ఈ రోజు వరకు కూడా ఏ ఒక్క నిరుద్యోగికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు, దాదాపు రెండు సంవత్సరాలు అంటే 72 వేల రూపాయలు సుమారు నిరుద్యోగులకు ఇవ్వాలి, కెసిఆర్ ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగులను నిరుద్యోగులను టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసింది, , జిహెచ్ఎంసి ఎన్నికల తీర్పుతో దిగొచ్చిన కేసీఆర్ ఉద్యోగ నోటిఫికేషన్లు,పిఆర్ సి అమలు,%జూబొ% రిజర్వేషన్లు అమలు, ఇతర డిమాండ్ల విషయంలో యూ టర్న్ లు తీసుకుంటూ మరిన్ని మోసపూరిత నాటకాలకు తెర తీస్తున్నారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పి ఇంతవరకు రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారు, టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి, అక్రమాలకు పాలుపడుతూన్నది.నిధులు లేవు, నియామకాలులేవు, ఉద్యోగ నోటిఫికేషన్లు లేవు, నిరుద్యోగులు ,ప్రభుత్వ ఉద్యోగులు టిఆర్ఎస్ ప్రభుత్వం పై కోపంగా ఉన్నారు కావున టిఆర్ఎస్ ప్రత్యామ్నాయంగా బిజెపి మాత్రమే ఉన్నది, కావున ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రుల అందరూ కూడా బిజెపి వైపు చూస్తున్నారు, కావున టిఆర్ఎస్ మెడలు వంచి నిరుద్యోగుల సమస్యలను, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తిర్చడానికి ప్రయత్నం చేస్తాను కావున ఎమ్మెల్సీ ఎన్నికల్లో నన్ను గెలిపించ



వలసినదిగా బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్రెడ్డి పట్టభద్రులను కోరినారు, ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు చిలుకూరి రమేష్ బిజెపి జిల్లా కోశాధికారి నున్న రమేష్,జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మదినేని సతీష్, %దీజీ% మండల అధ్యక్షుడు సిరపురపు ప్రసాద్ ,గోపాలరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


## మంత్రి సహకారంతో క్యాన్సర్ వ్యాధి నుండి కోలుకున్న షేక్ ముబ్బషీర్




గొల్లపల్లి, ఫిబ్రవరి 03 (ప్రజాపాలన):?జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం తిరుమల పురం పీడీ గ్రామానికి చెందిన షేక్ ముబ్బషీర్ గారు క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతు గత సంవత్సరం అక్టోబర్ నెలలో కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను కలవడం జరిగింది. తక్షణమే స్పందించిన మంత్రి వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని వారికి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం రూ 2 లక్షల రూపాయల ఎల్ ఓ సి ని అందించగా షేక్ ముబ్బషీర్ మంత్రి సహకారంతో క్యాన్సర్ వ్యాధి నుండి పూర్తిగా కోలుకుని బుధవారం రోజున కుటుంబ సభ్యులతో కరీంనగర్ నివాసంలో మంత్రి గారిని కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వారి ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.?ఈ కుటుంబ సభ్యుల వెంట గ్రామ సర్పంచ్ రమేష్, కో- ఆప్షన్ మొహమ్మద్ అలీ ఉన్నారు.

## నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ


### పాత్రికేయులు కడకుంట్ల జగదీశ్వర్, ఏ. ఎం.రాజు రెడ్డి



రాయికల్, ఫిబ్రవరి 03 (ప్రజాపాలన):రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన దరీనేనీ జల అనే నిరుపేద మహిళ భర్త వాహన ప్రమాదంలో మరణించాడు. పనిచేసే ఇంటిపెద్ద దిక్కును కోల్పోయి అనాథగా మారిన జల ఇద్దరు పిల్లలు మరియు ముసలి అత్తతో అనేక అష్టకష్టాలు పడుతున్న విషయం తెలుసుకున్న సామాజిక సేవకులు కడకుంట్ల జగదీశ్వర్ మానవత్వంతో స్పందించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎ.ఎమ్ రాజురెడ్డి ఆర్థిక సహాయం చేశారు. ఇట్టి సందర్భంగా ఆలూరు గ్రామ మాజీ సర్పంచ్ మోక్కొండ రాంరెడ్డి, ఎం.పి.టి.సి సోమిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మానవత్వంతో స్పందించి నిరుపేద మహిళ కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, స్ఫూర్తిగా నిలిచిన సేవలు హర్షణీయమని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చింతకుంట సాయికుమార్,తదితరులు పాల్గొన్నారు.దాతలు మరింత ముందుకు వచ్చి బ్యాంక్ అకౌంట్ నెంబర్ 34437061613 లో ఆర్థిక సహాయం చేయగలరని కోరారు.

## నర్సరీల తనిఖీ..ఆదేశాల జారీ...

### మున్సిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి ప్రవీణ్



జగిత్యాల, ఫిబ్రవరి 02 (ప్రజాపాలన): జగిత్యాల మున్సిపల్ పరిధి దరూర్ క్యాంపులో మున్సిపల్ చైర్ పర్సన్ డా. బోగ శ్రావణి ప్రవీణ్ నర్సరీలను తనిఖీచేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. శ్రావణి మాట్లాడుతూ మొక్కల పెంపకం నిర్వహణ సరిగ్గా లేదని అంధులో వాడుతున్న మట్టి సరవంతంగా లేదని అధికారులపై మండిపడ్డారు. నర్సరీలో మొక్కల పెంపకం సరిగ్గా చేయాలని మొక్కలకు నీరు సరిగా అందేలా చూసుకోవాలని, వచ్చే వనకాలంలో హరితహారం మొక్కల పంపిణీకి అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆధేసించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో కౌన్సిలర్లు వొద్ది శ్రీలత రామ్మోహన్, జుంబర్తి రాజ్ కుమార్, కప్పల శ్రీకాంత్, కూతురు రాజేష్, కోరే గంగమల్లు, నాయకులు కూతురు శేకర్, మహేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విధ్యాసాగర్ రావ్, మరియు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి క్షమాపణ చెప్పాలి



బాలాపూర్ : ప్రజాపాలన : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్ పేట్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర టిఆర్ఎస్ ఎమ్మెల్యే ధర్మారెడ్డి నీ సస్పెండ్ చేయాలని నిరసన చేశారు. చెరుకుపల్లి వెంకట రెడ్డి మాట్లాడుతూ....... రామజన్మభూమి సమస్య, కోటు వివాదాల కారణాల వల్ల ఆగిపోయిన సందర్భంగా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో చొరవతో చక్కచాణక్యం గా సమస్యను పరిష్కరించారు. కేంద్ర పరిమితి ఆధీనంలో ఒక ట్రస్టు ఏర్పరచి, ఆ ట్రస్టు ద్వారానే భారతదేశంలో ఉన్నటువంటి హిందువుల బంధువులందరూ కలిసి నీది నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కుల మత వర్గ విభేదాలు లేకుండా నిధులను స్వీకరించి, రామమందిరాన్ని ఏర్పరచడానికి ఒకే తాటిపై నిలబడుతున్న సందర్భంలో మన తెలంగాణ రాష్ట్రంలో కొందరు దృష్టశక్తులు హిందువుల మనోభావాలను కించపరుస్తా, అనుచిత వ్యాఖ్యలతో బాధ పెడుతున్నారు. గడపగడపకు వెళ్లి నీది సేకరణలో భాగంగా వారిని అరెస్టు చేయించడం వారిపై కేసులు పెట్టడం దుర్భాషలాడటం ఇది సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తపరిచారు. యావత్ ప్రపంచం గర్వించదగ్గ హిందువుల రామ మందిరానికి ఎలాంటి ఆటంకం జరిగిన హిందువుల మనోభావాలు దెబ్బ తీసిన టిఆర్ఎస్ ఎమ్మెల్యే లకు భారతీయ జనతా పార్టీ హిందువుల బంధువులందరూ ముక్తకంఠంతో హెచ్చరించారు. వరంగల్ జిల్లా అర్బన్ ప్రాంతానికి చెందిన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బిజెపి పార్టీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, ఎన్. యాదగిరి, ఐలయ్య యాదవ్, రామకృష్ణ రెడ్డి, బిజెపి కార్యకర్తలు మహిళామణులు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల ఎమ్మెల్యే ను సస్పెండ్ చేయాలని బిజెపి నేతలు నిరసన




బాలాపూర్ : ప్రజాపాలన : మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బిజెపి అధ్యక్షులు పెండ్యాల నరసింహ్మ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తా లో పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి హిందువుల పై దుర్భాషలాడిన సందర్భంగా నిరసన తెలియజేశారు. అధ్యక్షులు మాట్లాడుతూ.... వరంగల్ జిల్లా అర్బన్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే పరకాల చల్లా ధర్మారెడ్డి ఎస్సి, బిసి హిందువులందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిందువుల ఓట్లతో గెలిచి 43 మంది పై కేసులు పెట్టడం, పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని బిజెపి పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఖబర్దార్ మీ పదవికి రాజీనామా చేయాలినీ లేదు.. కేసీఆర్ ఎమ్మెల్యే ని సస్పెండ్ చేయాలని భారతీయ జనతా పార్టీ ఆగ్రహం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు కీసర గోవర్ధన్ రెడ్డి, సుల ప్రభాకర్, మద్ది రాజశేఖర్, సోమేశ్వర్, గడ్డం జగన్, సుజాత, జె డి కుమార్, నాగరాజు, కరుణానిధి, శ్రావణ్, రమేష్, గోపీనాథ్, భీమ్ రాజ్, వెంకటేష్, బి. శ్రావణ్, శ్యామల శ్రావణ్, నవీన్ కుమార్ , రాజశేఖర్, స్వామి, కిరణ్ కుమార్, కాశిరాం, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికులపై కేంద్రప్రభుత్వం చిన్న చూపు

### తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరుగు మల్లికార్జున్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి03, ప్రజాపాలన :కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో గల్ఫ్ కార్మికుల సంక్షేమ్మనికి చోటే లేదని మోదీ ప్రభుత్వం వలస బిడ్డలపై చిన్న చూపు చూపించారని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరుగు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం దుబాయ్ నుంచి ప్రజాపాలన తో మాట్లాడుతూ తన ఆవేదన వ్యక్తం చేశారు. ధనవంతులైన ఎన్నారైలకు పన్ను మినాయహింపు ఇస్తూ కేంద్రం చేసిన ప్రకటనతో ఎన్నారైలకు తీపి కబురు అందించి పేద గల్ఫ్ కార్మికులకు మాత్రం మొండి చేయి చూపిందని పేర్కొన్నారు. బారత దేశానికి ప్రవాస కార్మికుల ద్వారా ప్రతినెల వచ్చే లక్షల కోట్ల ఆదాయం గల్ఫ్ దేశాలకు వలస వెల్లిన కార్మికుల ద్వారానే లభిస్తుంది అన్నారు. గల్ఫ్ దేశాలలో సుమారు 90 లక్షల మంది భారతీయులు ఉపాది పొందుతున్నారని పేర్కొన్నారు. ఎన్నారైలకు పన్ను మినాయహింపు ప్రకటించడం వలన దనవంతులైన వారికే ప్రయోజనం కలుగుతుందని గల్ఫ్ కార్మికులకు మాత్రం ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అసంతృప్తిని వ్యక్తపరిచారు.

## అక్రమంగా ఏర్పాటు చేసిన టేల తొలగింపు



క్యాతన్ పెల్లి, జనవరి03, ప్రజాపాలన :మందమరి ఏరియా రామకృష్ణాపూర్ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తాలో అక్రమంగా ఏర్పాటు వేసిన ఇనుప టేలను బుధవారం ఏరియా సింగరేణి సిబ్బంది తొలగించి ట్రాక్టర్ ద్వారా తరలించారు, ఈ సందర్భంగా సింగరేణి అధికారి జూనియర్ ఇన్స్పెక్టర్ , సమ్మయ్య మాట్లాడుతూ అక్రమంగా వెలిసిన టెలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించడం జరిగిందని తెలియజేశారు, ఏరియాలో సింగరేణి స్థలాల్లో అనుమతి లెని కట్టడాలు, చేపట్టిన కబ్జాలకు, పాల్పడిన సింగరేణి నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు, అక్రమ కట్టడాలు జరిగినట్లయితే అధికారుల ఆదేశాల మేరకు తొలగించడం జరుగుతుందన్నారు, సింగరేణిలో అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకు సింగరేణి ఎస్టేట్, సెక్యూరిటీ, అధికారులు యాజమాన్యం ఎప్పుడు ముందు ఉంటుంది అన్నారు, ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ జమేదారు, డి,న్,రెడ్డి ,సింగరేణి సెక్యూరిటీ గార్డ్స్ పాల్గొన్నారు.

## ఆధార్ కార్డుకు మొబైల్ లింక్ తప్పని సరి

### జిల్లా కలెక్టర్ భారతి హెూళికేరి

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,ఫిబ్రవరి 03, ప్రజాపాలన :రేషన్ బియ్యం తీసుకునే లబ్ధిదారులు తమకు సంబంధించిన ఆదర్ కు మొబైల్ లింక్ తప్పని సరి గా ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ భారతి హెూళికేరి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రేషన్ బియ్యం తీసుకొనే వారి కోసం ఇంతకు ముందు నంబందిత రేషన్ డీలర్ దగ్గర బయోమెట్రిక్ తీసుకొని లబ్ధిదారులు బియ్యం పొందటం జరిగిందని , ఐతే 01.02.2021 నుండి రేషన్ కార్డు లోని కుటుంబ సభ్యులలో ఎవరిదైన ఒక్క ఆధార్ కార్డు కు వారి యొక్క మొబైల్ నెంబర్ తప్పనిసరి గా ఉండాలని పేర్కొన్నారు. అట్టి మీ మొబైల్ కి ఓ.టి.పి (వన్టైం పాస్ వర్డ్) నెంబర్ ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తప్పనిసరి గా ప్రతిఒక్కరు తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆదార్ నెంబర్ కు మొబైల్ నెంబర్ లింక్ చేసుకోవాలని తెలిపారు. ఇందుకు జిల్లా లోని అధార్ లింక్ మీ సేవ కేంద్రాలు ఐనా బెల్లంపల్లి ఇటీపాముల క్రిష్ణ, బెల్లంపల్లి హబీబ్, చెన్నూర్ గుండా రవి కిరణ్, దండేపల్లి తోట్ల అర్చన, జన్నారం గోలి భానుచందర్, కాసిపేట జెల్ల శ్యాం బాబు, మంచిర్యాల ఆఫ్రీన్ నుల్తానా, మంచిర్యాల కొంపెల్లి నతీష్, మంచిర్యాల నయ్యద్ ఖాజీం అలీ మంచిర్యాల బైరి నత్యనారాయణ, మంచిర్యాల మల్లేష్, మందమర్రి కొత్తపల్లి నత్యనారాయణ, మందమర్రి ఉపేందర్ నన్పూర్ సాప్ల ప్రసాద్, తాండూర్ ఠాకూర్ ఉమా సింగ్ ల వద్ద ఆధార్ కేంద్రాలలో మీ యొక్క మొబైల్ నెంబర్ ని లింక్ చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఫోన్ లేని రేషన్ కార్డు దారులకు వారియొక్క యొక్క రేషన్ బియ్యం తీసుకొనుటకు రేషన్ డీలర్ దగ్గర ఐరిష్ స్కానర్ ద్వారా వారికి బియ్యం పంపిణీ చేయబడుతుందని అన్నారు.

## సుజాతనగర్ లో వైకుంఠ దామం డంపింగ్ షెడ్ లను ప్రారంభించిన సర్పంచ్ శికా కృష్ణవేణి



భద్రాద్రికొత్తగూడెం జిల్లా సుజాతనగర్ ప్రజాపాలన : సుజాతనగర్ మండల పరిధిలోని శివాలయం ప్రక్కన నిర్మాణం జరిగిన తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల లో భాగంగా సుజాతనగర్ వైకుంఠధామం, ఇరవై కుంటల స్థలం, పది కుంటల స్థలం లో డంపింగ్ షెడ్ లను సుజాతనగర్ సర్పంచ్ శికా కృష్ణవేణి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డంపింగ్ షెడ్ కు 2.5 లక్షలు వైకుంఠ దామం కు 11.40918 లక్షల ఖర్చు తో తెలంగాణ ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమాన్ని తీసుకువచ్చింది సి. ఎమ్. కె సి ఆర్ ముందుతారాల వారికి కూడా ఉపయోగపడే విధంగా ఆయన పనిచేస్తున్నారు అని కృష్ణవేణి అన్నారు ఈ ప్రారంభోత్సవానికి ఎంపీడీఓ వెంకటలక్ష్మి, తహసీల్దారు నాగరాజు, , ఎమ్ పి టి సి బత్తుల మానస ఉప సర్పంచ్ లింగం చిన్న పిచిరెడ్డి , గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## బడ్జెట్ లో విద్యార్థులకు భారీగా అన్యాయం జరిగింది:ఎస్ ఎఫ్ ఐ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం ప్రజాపాలన :ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యార్థులకు భారీగా అన్యాయం జరిగిందని ఈరోజు జూలూరుపాడు మండలం లో ప్రధాన రహదారి నందు ధర్నా మరియు బొమ్మ దహనం చేయడం జరిగింది...ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ మాట్లాడుతూ బడ్జెట్ విషయంలో విద్యార్థులకు 10 శాతం ఇవ్వాలని విద్యార్థి సంఘాలు మరియు మేధావులు ఇతర అ సంఘాలు చెప్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2 .67 ఇవ్వడం అనేది చాలా బాధాకరమైన విషయం. అంటే కేవలం 93 వేల కోట్లు మాత్రమే మే ఇవ్వడం జరుగుతుంది.. గత ఏడాది 3.27 అంటే 99 కోట్లు విడుదల చేసింది. ఈ సంవత్సరం దాదాపు ఏడు కోట్లు విద్యార్థులకు నష్టం జరుగుతుందని నిరసనల్లో చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు జమ్మి యశ్వంత్. వై గగన్. మోదుగు శివ. ఎన్. వంశీ కె ఆకాశ్. సుమంత్. మని చంద్ర. రాము. కార్తీక్. తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ ఉద్యోగుల నిరసన ఒక రోజు విధుల బహిష్కరణ

### విజవంతం:టి-జె.ఏ.సి అధ్యక్ష కార్యదర్శుల పిలుపు




వెంట్ పల్లి, ఫిబ్రవరి 03 (ప్రజాపాలన): విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు ముఖ్యంగా విద్యుత్ సవరణ బిల్లు 2021 మరియు విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు రూపొందించిన స్టాండర్డ్ బిడ్డింగ్ (ఎస్.బి.డి)ని ఉపసంహరించుకోవాలని అందుకు నిరసనగా బుధవారం ఉ.10 గంటలకు అన్ని డివిజన్ ఇంజనీర్ కార్యాలయల మరియు సర్కిల్ కార్యాలయల యందు తమ నిరసనను తెలియజేయవలసిందిగా టి-జె.ఏ.సి నిర్ణయం మరియు నాయకుల పిలుపు మేరకు మెట్ పల్లి డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం నందు మరియు అసిస్టెంట్ అకౌంట్స్ కార్యాలయం నందు కార్మికులు మరియు అధికారులు కేంద్ర ప్రభుత్వ బిల్లుకు వ్యతిరేకంగా తమ యొక్క నిరసనను తెలియజేయడంతో పాటు కేంద్ర మొండి వైఖరికి నిరసనగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో డివిజనల్ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు కార్మికులు పెద్ద మొత్తంలో పాలుగొని నిరసనను విజవంతం చేశారు.

# సేవకై జీవించు - సేవకై తపించు

మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :మధిర సేవా సమితి మరియు శ్రీ జ్యోతి యాత్ర అయ్యప్ప భక్త బృందం మధిర వారి ఆధ్వర్యంలో, చి"డోకుపర్తి మణికంఠ, ఆర్థిక సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ఈరోజు శ్రీ కన్యకా పరమేశ్వరి ??ఆలయ ఆవరణ నందు, శ్రీ శ్రీ శ్రీ రాంపిళ్ళ లక్ష్మణ్ రావు గురు స్వామి ఐదో వ వర్ధంతి సందర్భంగా, మధిర సేవా సమితి మరియు శ్రీ జ్యోతి యాత్ర అయ్యప్ప భక్త బృందం మధిర వార్ల, చే అత్యంత నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం




చేసినారు.లిఈ కార్యక్రమంనకు ఆర్థిక సహకారం శ్రీ డోకుపర్తి సత్యం బాబు, ధర్మపత్ని ఝాన్సీ గార్ల, తనయుడు చిరంజీవి మణికంఠ సహాయ సహకారాలతో దుప్పట్లు పంపిణీ చేసి, గురు స్వామి గారి సేవలను ఈ సందర్భంగా కొనియాడి గుర్తు చేసుకున్నారు.లిఈ కార్యక్రమము స్థానిక ఆలయ అర్చకులు శ్రీమాన్ శేషాచార్యులు గారు చేత నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో లో పెద్దలు శ్రీ వాసవిఆర్య వైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు ఇరుకుళ్ళ లక్ష్మీ నరసింహారావు గారు, పసుమర్తి సుబ్బారావు, గారు, పల్లపోతు వెంకటేశ్వరావు (కనుమూరు) గారు, మరియు మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాద్ రావు, ఉపాధ్యక్షులు కోమటిడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారి లక్ష్మణ్ ,జనరల్ సెక్రటరీ చారు గుండ్ల లక్ష్మీ నరసింహ మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జంగానర్సిరెడ్డి, గౌరవ సభ్యులు కోమటి సుధాకర్, మరియు శ్రీ జ్యోతి యాత్ర అయ్యప్ప భక్త బృందం మధిర డోకుపర్తి సత్యం బాబు గారు, మిర్యాల కాశీ విశ్వేశ్వర రావు గారు,యార్లగడ్డ నరసింహారావు గారు, యార్లగడ్డ రమేష్ గారు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షులు కపిలవాయి జగన్ గారు స్వామి సతీష్ గారు టీమ్ పాల్గొన్నారు.




## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :ఎంపీపీ %వీ%.లలితలివాహనదారులు వాహనాలు నడిపే సమయంలో అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తప్పనిసరిగా ఎలిమెంట్ పెట్టుకోవాలని,ఫోన్ మాట్లాడుతూ బండి నడప రాదని,సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని ఆమె సూచించారు. ఈరోజు ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రోడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కార్యక్రమం లో భాగంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజారావు ఆర్టీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయివేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలి

మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :మధిరవిద్యుత్ శాఖ లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చే నూతన ప్రాంఛెజెస్ విధానానికి వ్యతిరేకంగా, ప్రయివేటీకరణ విధానలను ఉపసంహరించు కోవాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని,%జూూ% పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలి అని కోరుతూ దేశ వ్యాప్తంగా విద్యుత్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మధిర పట్టణ సెక్షన్, రూరల్ ఆఫీసు ల ముందు మరియు సబ్ డివిజన్ %ూణజు% కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో %ూజు% శరత్ కుమార్, %ూూూ% వెంకట నరసయ్య, కార్మిక సంఘాల ప్రతినిధులు రవి,కోటేశ్వరరావు,క్రిష్ణ,అశోక్,క్రిష్ణ ప్రసాద్, శ్రీధర్, రాజేశ్వరి,బేగం,లావణ్య, మైతిలి, కార్మికులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికలపై జరిగే సన్నాహక సభను విజయవంతం చేయాలి

మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన : చింతకాని,మధిర మండలాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై రేపు జరిగే పల్లా రాజేశ్వర్ రెడ్డి గారి సన్నాహక సభ ను జయప్రదం చేయాలిజిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజులిఈ సందర్భంగా మధిర నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో జరిగిన మీటింగ్ లో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ రేపు ఉదయం 10:00 గంటలకు (ముదిగొండ, చింతకాని బోనకల్) మండలాల నాగులవంచ లో వంకాయలపాటి రామయ్య ఫంక్షన్ హాల్ లో జరిగే, సాయంత్రం 05:00 గంటలకు మధిర శ్రీరస్తు ఫంక్షన్ హాల్ లో



(మధిర టౌన్,రూరల్, ఏర్రుపాలేం) జరిగే పట్టభద్రుల ఓటర్లకు జరిగే సభను ఉద్యోగులు,విద్యార్థులు, యువకులు పట్టభద్రుల ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ హాజరై సభ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి రంగారావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ రంగిసెట్టి కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి,కనుమూరి వెంకటేశ్వ రావు, టిఆర్ఎస్ జిల్లా నాయకులు మొండితోక జయకర్, కౌన్సిలర్లు సర్పంచులు ఎంపీటీసీలు మండల గ్రామ పార్టీ అధ్యక్షులు సొసైటీ అధ్యక్షులు డైరెక్టర్లు ఇతర పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు.

## కులాల పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి

బేడ(బుడగ)జంగాల రాష్ట్ర నాయకులు,వీరనరసింహ సేవసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పస్తం సైదులు

మహబూబాబాద్ జిల్లా, దంతాలపల్లి మండలం ప్రజాపాలన:ఎస్సి, ఎస్టీ, బీసీ కులాల పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ధర్మారెడ్డిని బర్తరఫ్ చేసి,పార్టీ నుంచి బహిష్కరించాలని బేడ(బుడగ) జంగాల రాష్ట్ర నాయకులు, వీరనరసింహ సేవసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పస్తం సైదులు ప్రభుత్వని డిమాండ్ చేశారు.బుధవారం దంతాలపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...డా.బీఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్ల దేశం మొత్తం నడుస్తుందనే విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు.బడుగు



బలహీన వర్గాల ఓట్లతో గెలిచిన ధర్మారెడ్డి రిజర్వేషన్లను విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.చిన్నకులాలు మట్టిలో ఆణిముత్యాలన్న విషయం ధర్మారెడ్డి వంటి నేతలు గ్రహించాలన్నారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ స్పందించాలన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ అధ్యక్షులు అల్లం రామనర్సయ్య,ఉపాధ్యక్షుడు నర్మాటి రామరాజు, కొండపల్లి శ్రీనివాస్, కొండపల్లి చంద్రయ్య, పి.వల్లయ్య, కళ్యాణి గణేష్, బోడపూర్తి బిక్షం, ఎన్.సీతారా ములు,కె. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు అవగాహన కల్పించిన తాహసీల్దార్



మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :మధిర లోని గవర్నమెంట్ మీసేవ సందర్శించి తాసిల్దార్ గారు రేషన్ కార్డు కు సెల్ ఫోన్ లింక్ విషయంలో ఐరిష్ పడేవాళ్ళు ఈ సేవలో సెల్ ఫోన్ తో లింకు చేసుకొన అవసరం లేదని ఐరిష్ లేనివాళ్ళు లింకు చేయించుకోవాలని ఈ సేవ యాజమాన్యానికి తెలియజేశారు. కావునలబ్ధిదారులు గమనించాల్సింది ఐరిష్ లేని వారుమాత్రమే ఈ సేవ లో సెల్ఫోన్తో లింక్ చేసుకోవాలని ఈ విషయాన్నిగమనించగలరు: రేషన్ దుకాణాలు నిఖీ చేసిన తహసీల్దార్ సైదులఐరిష్ అనుసంధానం కానీ వారు మాత్రమే రేషన్ కార్డు ఆధార్ లింక్ చేసుకోవాలి రేషన్ కార్డుదారులకు అవగాహన కల్పించాలని డీలర్లకు సూచించిన తహసిల్దార్ మధిర పట్టణంలోని రేషన్ దుకాణాలను బుధవారం తాసిల్దార్ డి సైదులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజా పక్షం దినపత్రికలో ప్రచురితమైన 'పక్క రాష్ట్రాలకు తరలుతున్న పేదల బియ్యం' అనే కథనానికి స్పందించిన ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ నిర్వహణ రిజిస్టర్ లను పరిశీలించి స్టాక్ వివరాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐరిష్ అనుసంధానం కానీ వారు మాత్రమే రేషన్ కార్డ్ ఆధార్ నెంబర్ కు లింక్ చేసుకోవాలి, దీనిపై కార్డుదారులకు అవగాహన కల్పించాలని రేషన్ డీలర్లకు సూచించారు. రేషన్ కార్డు దారులు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.



ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| తల్లనారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| పి. లక్ష్మీనారాయణ గౌడ్ | - | కొల్చారం | - | 9912532909 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| అన్వర్ బాషా | - | కుత్బుల్లాపూర్ | - | 7993047109 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| శైలజ | - | శేర్లింగంపల్లి | - | 8919627871 |
| సత్య కిషోర్ | - | సిద్దిపేట | - | 6309723472 |


## ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకోసం మరోపోరాటం:ఏపూరి



మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం జరిగే పోరాటానికి మాదిగ జాతి సిద్ధం కావాలి ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ పిలుపునిచ్చారు .ఈ రోజు మధిర రిక్రియేషన్ క్లబ్ హాల్లో రాయబారపు దేవదాసు మాదిగ అధ్యక్షత జరిగిన ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశానికి పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపూరి మాట్లాడుతూ ఈనెల 16న మధిరలో ఎమ్మార్పీఎస్ జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామస్థాయి నాయకత్వం హాజరు కావలసిందిగా పిలుపునిచ్చారు .ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు.కన్వీనర్ గా సిద్దు ప్రసాద్ మాదిగ, కో- కన్వీనర్ గా కమ్మంపాటి నరేష్ మాదిగను నియమించారు. ఈ సమావేశంలో పార్శపు యంకయ్య మాదిగ ,రంజాన్ రాజారత్నం మాదిగ, పల్లె పోగు స్వామి మాదిగ కనక పూడి పుల్లయ్య మాదిగ, నరసింహ రావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన : 04-02-2021 సాయంత్రం గం.5-00లకు దెందుకూరు గ్రామం లోని శ్రీరస్తు కళ్యాణమండపం లో జరుగునుఈ కార్యక్రమంలో లో ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ గారు పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు గారు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మాజీ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరావు గారు మధిర మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు గారు ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గారు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు కావున ఈ సమావేశము లో ఎమ్మెల్సీ ఓటర్ల తో ముఖాముఖి కార్యక్రమం కలదు. కావున ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఓటర్లు మధిర మండల టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్సీ అన్ని గ్రామాల ఇన్చార్జులు బాధ్యులు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయగలరుమధిర మండల టిఆర్ఎస్ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, మధిర పట్టణ అధ్యక్షులు దేవిశెట్టి రంగారావు,లి లిఎమ్మెల్సీ బాధ్యులు కనుమూరు వెంకటేశ్వరావులి

## డీడీ తీసిన వారికి గొర్రెలు పంపిణీ చేయాలని ధర్నా





మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన :తెలంగాణ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో సిరిపురం లో ని పశు వైద్య శాల ముందు ధర్నా నిర్వహించి.వినతి పత్రం అందజేశారు.అనంతరం సంఘం జిల్లా గౌరాధ్యక్షుడు,జిల్లా కార్యదర్శి చింతలచేరువు కోటేశ్వర రావు, మేకల నాగేశ్వర రావు లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కురుమ, యాదవుల ను ఆర్థికంగా అభివృద్ధి చేస్తానని చెప్పి. గొర్రెల కోసం డీడీ లు కట్టి రెండు సంవత్సారాలు అయిన గొర్రెలు పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పులు చేసి మరీ డీడీ లు కట్టినవారు వడ్డీలు కట్టలేక అప్పులపాలవ్తున్నరు.ప్రభుత్వం కురుమ యాదవుల కు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు %ఎష్ట్ర%.నాగేశ్వర రావు, రోశయ్య, సంపసా నీ గోపాలరావు, సంప సాని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నం దానం - సంతృప్తి దానం

మధిర, ఫిబ్రవరి 03, ప్రజాపాలన : జ్యోతి యాత్ర అయ్యప్ప భక్త బృందం మధిర వారు శ్రీ డోకుపర్తి సత్యంబాబు గారి ఆర్థిక సాయం తో నిరుపేదలకు అన్నదానం కార్యక్రమంలిలిస్థానిక మెయిన్ రోడ్డు శ్రీ సిద్ధి వినాయక ఆలయం నందు, ఈరోజు శ్రీ శ్రీ శ్రీ శ్రీ రాంపిళ్ళ లక్ష్మణ్ గురు స్వామి 5 వ వర్ధంతి సందర్భంగా అన్నం దానం కార్యక్రమం నిరు పేదలకు ఆర్తులకు నిర్వహించారులి. ఈకార్యక్రమం శ్రీ శ్రీ శ్రీ జ్యోతి యాత్ర అయ్యప్ప భక్త బృందం శ్రీ డోకుపర్తి సత్యంబాబు గారు, ధర్మపత్ని ఝాన్సీ గార్ల, దంపతుల తనయుడు చిరంజీవి మణికంఠ గారి ఆర్థిక సహాయంతో నిర్వహించినారు.లిఈ కార్యక్రమంలో కమిటీ బృందం మిర్యాల కాశీ విశ్వేశ్వర రావు గారు, కపిలవాయి జగన్ మోహన్ రావు గారు, యార్లగడ్డ నరసింహారావు గారు, యార్లగడ్డ రమేష్ గారు ,స్వామి సతీష్ గారు పాల్గొన్నారు.



# కేన్సర్‌కు 'సూపర్' చికిత్స!



జిల్లాకు ఒక యూనిట్, ప్రాంతానికి ఒక సూపర్ స్పెషాలిటీ, ఉన్న దగ్గర ఉన్నతంగా మెరుగులు.. రాష్ట్రమంతటా కేన్సర్ వైద్య అవకాశాలను పెద్దఎత్తున పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. రాష్ట్రంలో కేన్సర్ వైద్య చికిత్సకు అవకాశాలు తక్కువ. ఉన్నదగ్గర కూడా, ప్రాథమికస్థాయిలోని కేసులకే వైద్యం అందించే వీలుంది. ఉదాహరణకు రాజధాని నగరం విజయవాడలో ఈరోజుకీ ఒక్క కేన్సర్ సెంటర్ కూడా లేదు. విశాఖ, గుంటూరులలో స్టేజ్-1 కేసులను చూడగలుగుతున్నారు. దీంతో, అయితే హైదరాబాద్ లేదంటే చెన్నై, బెంగళూరుకు రోగులు వెళ్లాల్సిన పరిస్థితి! ఈ నేపథ్యంలో వారికి వారు ఉన్నదగ్గరే పూర్తిస్థాయిలో పరీక్షలు, చికిత్సను అందుబాటులోకి తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అనంతపురం నుంచి శ్రీకాకుళం దాకా.. 13 జిల్లాల్లోనూ జిల్లాకు ఒక చొప్పున కేన్సర్ యూనిట్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు.. ప్రాంతానికి ఒకటి చొప్పున అన్ని హంగులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నెలకొల్పాలని సంకల్పించింది. దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిధిలో ఇప్పటికే కొన్ని చోట్ల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

మరో మెట్టు పైకి..

విశాఖ కేజీహెచ్‌లో ఆంకాలజీ విభాగంలో రేడియేషన్ థెరపీతో కేన్సర్ రోగులకు వైద్యం చేస్తున్నారు. సాధారణ స్టేజ్‌లో ఉన్న రోగులకు మాత్రమే ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. ఈ విభాగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం గత ఏడాది పక్కా ప్రణాళిక రూపొంచింది. సమీర్ రిసెర్చ్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకుంది. విశాఖ మెడ్ టెక్ జోన్‌లో కేన్సర్‌కు సంబంధించిన వైద్య పరికరాలను ఈ సంస్థ తయారు చేస్తుంది. తన వద్ద ఉన్న టెక్నాలజీని మన రాష్ట్రానికి అందించేందుకు ముందుకొచ్చింది. అలాగే, కేజీహెచ్‌లోని అంకాలజీ విభాగాన్ని కొత్తగా నిర్మిస్తున్న సీఎస్ఆర్ బ్లాక్‌లోకి మార్చనున్నారు.

ఈ బ్లాక్‌లో ప్రస్తుతం ఉన్న కొబాల్డ్ యూనిట్‌తోపాటు మరింత అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించాలని నిర్ణయించారు. కేన్సర్ వ్యాధి నిర్ధారణకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉపయోగిస్తున్న "పెట్ స్కాన్"నూ ఏర్పాటు చేసేందుకు ఆరోగ్యశాఖ సిద్ధం అయింది. పెట్ స్కాన్ కొనుగోలుకు సుమారు రూ. 8 నుంచి రూ. 10 కోట్ల వరకూ ఖర్చు చేయాల్సి అవసరం ఉంది. దీనిని పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ బ్లాక్ సిద్ధమయితే, ఉత్తరాంధ్ర జిల్లాలవారికి వేరే రాష్ట్రాలకు ప్రయాణాల ప్రయాస తప్పిపోతుంది.

కర్నూలులో స్టేట్ ఆస్పత్రి

కర్నూలు జిల్లాలో రూ. 120 కోట్ల నిధులతో స్టేట్ కేన్సర్ సెంటర్ ఏర్పాటు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించే ఈ ఆసుపత్రి.. రిఫరల్ సేవలు అందిస్తుంది. రాష్ట్రంలోని అన్ని కేన్సర్ ఆసుపత్రులు, ఓపీ బ్లాక్‌ల నుంచి చివరి దశ రోగులను ఇక్కడకు తరలిస్తారు. ఇక..నెల్లూరు జిల్లాలో రూ. 40కోట్లతో "థెర్షికేర్ కేన్సర్ సెంటర్" ఏర్పాటు కాబోతుంది. తిరుపతి స్విమ్స్‌లో ఆంకాలజీ విభాగం అద్భుతంగా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆలోచన మేరకు అన్ని బోధనాసుపత్రుల్లో ఆంకాలజీ విభాగం అందుబాటులోకి వస్తే ఎంసీఐ పీజీ సీట్లు కూడా కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో జనరల్ సర్జరీ విభాగ వైద్యులే ఆంకాలజీ విభాగంలో రోగులకు వైద్యం చేస్తున్నారు. అన్ని సదుపాయాలతో ఆంకాలజీ విభాగాలు ఏర్పాటు చేస్తే పీజీ సీట్లు రావడంతో పాటు రెండేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ఆంకాలజిస్ట్‌ల సంఖ్యా పెరుగుతుంది.

బెజవాడ బెంగ తీరినట్టే..

విజయవాడ, గుంటూరు బోధనాసుపత్రుల్లో ప్రత్యేకంగా సూపర్ స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. విజయవాడలో కేన్సర్ రోగులకు వైద్యం చేసే విభాగంలేదు. గుంటూరు జిల్లా చిన్నకాకానిలోని కేన్సర్ ఆసుపత్రి.. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ పరిధిలోనే ఉంటుంది. అయితే, కృష్ణాజిల్లాతో దానికి ఎలాంటి సంబంధం ఉండదు. కేన్సర్ వైద్య విస్తరణలో భాగంగా.. త్వరలోనే విజయవాడలో పీఎంఎస్ఎస్ నిధులతో నిర్మించే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆంకాలజీ విభాగాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. తొలిసారిగా కృష్ణాజిల్లా వాసులకు కేన్సర్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. చిన్నకాకానిలోని కేన్సర్ ఆసుపత్రిలో కొబాల్డ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. గుంటూరు జిల్లా బోధనాసుపత్రుల్లో నాట్కో నిధులతో నిర్మించే భవనంలో ఆంకాలజీ విభాగాన్ని రూ. ఏడు కోట్లతో సూపర్ స్పెషాలిటీ హంగులతో ఏర్పాటు చేయనున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కేన్సర్ వైద్యరంగం మెరుగుపడితే, ఆ ప్రయోజనం పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాలకూ అందుతుంది

## సాంబార్‌తో కొలాన్ క్యాన్సర్ దూరం!



భారతీయులు ఎంతో ఇష్టంగా తినే సాంబార్ కొలాన్ క్యాన్సర్‌ను అడ్డుకుంటుందని అమెరికాలో నిర్వహించిన ప్రీ క్లీనికల్ పరిశోధనల్లో వెల్లడైంది. ఈ వంటకంలో వాడే దినుసులే క్యాన్సర్ కణాలు అడ్డుకుంటాయని పరిశోధకులు భావిస్తున్నారు. అక్కడ ఎలుకల మీద నిర్వహించిన పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. ఎలుకలకి కొన్ని రోజుల పాటు ప్రతిరోజూ సాంబార్‌తో కూడిన ఆహారాన్ని అందించారు. అనంతరం వీటిని పరిశీలించగా పెద్దపేగులో ఏర్పడే క్యాన్సర్ కణాల ఎదుగుదల నిలిచిన సంగతిని గ్రహించారు. కేవలం వీటికి సాంబారు ఆహారం ఇవ్వడం వలన ఈ మార్పు వచ్చిందా? లేక మరేదైనా కారణం ఉందా? అన్న విషయాన్ని వీరు పరిశీలిస్తున్నారు.

## ఆల్కాహాల్‌తో చర్మ కేన్సర్



నిత్యం ఆల్కాహాల్ సేవించే వారిలో చర్మ కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అమెరికాలోని హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిశోధకులు తెలిపారు. రోజూ మందు తాగే 13 కేసులను పరిశీలించగా పుట్టకురుపు చర్మ కేన్సర్ లక్షణాలు కనబడినట్లు గుర్తించామని వివరించారు. నిత్యం మద్యం సేవించడం ప్రస్తుతం ఫ్యాషన్‌గా మారుతోందని, దాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చింది.


## కేన్సర్ నియంత్రణలో పసుపు

పసుపులో ఔషధ గుణాలున్నాయని మన పూర్వీకులు ఏనాడో చెప్పారు. ఇప్పుడు దీనికున్న మరో అద్భుతమైన గుణాన్ని శాస్త్రవేత్తలు పరిశోధించి కనుగొన్నారు. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే పసుపు కేన్సర్ నిరోధించడానికీ సాయపడుతుందని అమెరికా శాస్త్రవేత్తల బృందం వెల్లడించింది. ఈ బృందంలో భారత సంతతి శాస్త్రవేత్త కూడా ఉండడం విశేషం! పసుపులో ఉండే కర్కమిన్ సాయంతో పసికందులలో వచ్చే కేన్సర్‌ను సమర్థమంతంగా నిరోధించవచ్చుట. కాగా, పదేళ్లలోపు చిన్నారులకు ఈ కేన్సర్ ముప్పు ఎక్కువ. ఇందులో కణుతులు మందులకు లొంగవని నిపుణులు చెబుతున్నారు. ఈ తరహా మొండి కణుతులే లక్ష్యంగా సూక్ష్మ అణువులను పంపించేందుకు కర్కమిన్ తోడ్పడుతుందన్నారు. కణితిని అణిచివేసే సూక్ష్మ అణువులను కర్కమిన్‌కు జతచేసి నేరుగా లక్ష్యానికి చేర్చవచ్చన్నారు. ఇలా ఓ ప్రత్యేక పద్ధతిలో దాడి చేసి కేన్సర్‌ను నియంత్రించవచ్చని చెప్పారు. ఈ విషయంపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు.

## కణాల రీప్రోగ్రామింగ్‌తో కేన్సర్‌కు చెక్

రోగనిరోధక కణాలను ప్రేరేపించడం ద్వారా కేన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తలు కొత్త మందును తయారుచేశారు. బాధితుల రోగనిరోధక కణాలను బయటికి తీసి కేన్సర్ కణితిని అణిచివేసేలా జన్యుపరమైన మార్పులు చేసి ఆ కణాలను మళ్లీ ప్రవేశపెట్ట నున్నట్లు పీటర్ మెక్‌కల్లమ్ కేన్సర్ సెంటర్ పరిశోధకులు తెలిపారు. అక్యూట్ లింపోయిడ్ లుకేమియా తదితర రక్త కేన్సర్‌ను ఇలా నివారించవచ్చన్నారు. కఠినమైన కేన్సర్ కణితిపై దీని ప్రభావం ఉండదు.

## మూత్రాశయ కేన్సర్‌ను గుర్తించే తేలికైన పరీక్ష




మూత్రాశయ కేన్సర్‌ను గుర్తించేందుకు కచ్చితమైన, తేలికైన మూత్రపరీక్షను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మూత్రాశయ కేన్సర్ పునరావృతం అయ్యే అవకాశాలను ముందే గుర్తించేందుకు 'టెర్ట్' పరీక్ష పనిచేస్తుందని ఫ్రాన్స్‌లోని యూనివర్సిటీ హాస్పిటల్ ఆఫ్ లియోన్ పరిశోధకులు తెలిపారు. ఈ పరీక్షతో కండరాల గోడకు కేన్సర్ సంక్రమించేకంటే ముందే గుర్తించి చికిత్స చేయడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు.

## గర్భిణులు అధిక కొవ్వు తీసుకుంటే సంతానానికి రొమ్ము కేన్సర్!

మహిళలు గర్భంతో ఉన్నపుడు అధిక కొవ్వు ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటే సంతానానికి రొమ్ము కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరించారు. ఆ ప్రభావం మూడు తరాల వరకు ఉంటుందని తెలిపారు. అధిక కొవ్వు గర్భిణుల్లో జన్యు సంబంధ మార్పులు చోటుచేసుకుని రొమ్ము కేన్సర్‌కు దారి తీస్తుందని అమెరికాలోని జార్జ్‌టౌన్ లాంబార్డీ కాంప్రహెన్సివ్ కేన్సర్ సెంటర్ శాస్త్రవేత్తలు తెలిపారు.

## 50 దాటిన తర్వాతే ఎక్కువగా కేన్సర్!




ప్రస్తుతం మానవాళి ఎదుర్కొంటున్న ప్రమాదకరమైన జబ్బుల్లో కేన్సర్ ఒకటి. ప్రతి ఏడాది మన దేశంలో పది లక్షల కేన్సర్ కొత్త కేసులు నమోదవుతున్నాయి. వీరిలో 50 ఏళ్లు దాటిన వారే ఎక్కువ అంటారు- మన దేశంలో తొలి సారి క్యాన్సర్ నివారణ, నిర్వాహణ, చికిత్సల కోసం క్లినిక్‌లను ఏర్పాటు చేసిన సోనాలీ శృంగార్. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా క్లినిక్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో మన దేశంలో కేన్సర్ చికిత్సలో వస్తున్న మార్పుల గురించి ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

క్యాన్సర్ ఎందుకంత ప్రమాదకరమైనది?

ఇన్నేళ్ల పరిశోధనల తర్వాత కూడా కేన్సర్ విషయంలో మనకు ప్రశ్నలే ఎక్కువ. సమాధానాలు తక్కువ. ఉదాహరణకు పొగాకు తాగేవారికి లంగ్ కేన్సర్ వస్తే- కారణం ఏమిటో మనం గమనించగలుగుతాం. జీవితంలో పొగాకు ముట్టని వాళ్లకు కేన్సర్ వస్తే- ఎందుకు వచ్చిందో తెలియదు. జన్యు కారణాల వల్ల రావచ్చు. జీవన శైలి వల్ల రావచ్చు. ఇక- మన దేశంలో 80% కేసుల్లో రెండో, మూడో స్టేజీల్లోనే క్యాన్సర్ వచ్చిందని తెలుస్తుంది. ఈ దశ లో కేన్సర్ నివారణ కష్టమవుతుంది. లక్షలు ఖర్చు పెట్టినా గ్యారంటీ ఉండదు. అందువల్లే కేన్సర్ చాలా ప్రమాదకరం.

ఏ వయస్సు వారికి కేన్సర్ ఎక్కువ వస్తుంది?

కచ్చితంగా చెప్పలేం. ఎవరికైనా రావచ్చు. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి 90 ఏళ్ల వయస్సు ఉన్నవారి దాకా ఎవరికైనా రావచ్చు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా చూస్తే- 50 ఏళ్లు దాటిన వారికే కేన్సర్ ఎక్కువ వస్తోంది. ఇటీవల కాలంలో 21 ఏళ్ల వయస్సు దాటిన వారందరినీ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకొమ్మని సలహా ఇస్తున్నారు. కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ అవకాశాలు ఎక్కువ. చిన్న పిల్లలకు కూడా కేన్సర్ రావటం బాగా పెరిగింది. ఏ వయసు వారికి.. ఏ ప్రాంతం వారికి.. ఎలాంటి కేన్సర్ వస్తోందో చెప్పలేకపోవటానికి ప్రధాన కారణం- కచ్చితమైన సమాచారం లేకపోవటం.

ప్రభుత్వం కేన్సర్ రిజిస్ట్రరీలు నిర్వహిస్తుంది కదా..

మన దేశం మొత్తానికి కేంద్రీకృత రిజిస్ట్రరీ లేదు. రాష్ట్రాలన్నీ వేర్వేరుగా రిజిస్ట్రరీలు పెట్టి సమాచారం నమోదు చేస్తున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల దగ్గర, ట్రస్ట్ ఆసుపత్రుల దగ్గర, మాలాంటి సంస్థల వద్ద కూడా సమాచారం ఉంటుం ది. వీటన్నింటినీ సమీకృతం చేసే వ్యవస్థ ఉంటే క్యాన్సర్‌కు సంబంధించిన విధాన నిర్ణయాలు తీసుకోవటం చాలా సులభమవుతుంది. ఉదాహరణకు- ఒక ప్రాంతంలో లంగ్ కేన్సర్ ఎక్కువ ఉందనుకుందాం. ఆ ప్రాంతంలోనే లంగ్ కేన్సర్ ఎక్కువగా ఉండటానికి కారణాలు వెతకవచ్చు.

విదేశాలలో ఎలాంటి విధానాలు అమలులో ఉన్నాయి..

వారు స్క్రీనింగ్‌పై ఎక్కువ శ్రద్ధ పెడతారు. అమెరికాలో హెల్త్ చెకప్ నిర్ణీత షెడ్యూల్‌లో చేయించుకోపోతే- ఇన్సూరెన్స్ కంపెనీలు క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులు చెల్లించవు. బ్రిటన్‌లో నేషనల్ హెల్త్ స్కీమ్‌లో ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్త్‌చెకప్ చేయించుకోవాలి. మన దేశంలో అలాంటి విధానాలులేవు. దీనివల్ల కేసులు పెరుగుతాయి.

కేన్సర్ మందులు అందరికీ పనిచేయవనే వాదన..

ఇది నిజమే. కేన్సర్‌కు వాడే మందులు అందరికీ ఒకే విధంగా పనిచేయవు. ఉదాహరణకు ఇద్దరు కవలలకు క్యాన్సర్ వచ్చిందనుకుందాం. వారికి ఒకే మందు ఇస్తే- ఒకే విధంగా పనిచేస్తుందనే నమ్మకంలేదు. జన్యుకోడ్ ఆధారంగా కేన్సర్ వస్తుందో లేదో తెలుసుకొనే పద్ధతి అందుబాటులోకి వచ్చింది. దీనిపై మరింత పరిశోధనలు జరిగితే ఒక మందు పనిచేస్తుందా? లేదా? అనేది తెలుసుకోవచ్చు.

కేన్సర్ ట్రీట్‌మెంట్ విధానాల్లో మనం ఎక్కడున్నాం..

మౌలిక సదుపాయాలు, మిషన్ల విషయంలో మనం పాశ్చాత్య దేశాలతో పోటీపడుతున్నాం. అయితే మెడికల్ టెక్నాలజీ, పరిశోధనల విషయంలో వారు మన కన్నా చాలా ముందున్నారు. చాలా మంది డాక్టర్లు విదేశాలలో శిక్షణ తీసుకొని మన దగ్గరకు వచ్చి స్థిరపడుతున్నారు. మన దగ్గర సైకో ఆంకాలజిస్టల సంఖ్యకూడా పెరగాల్సి ఉంది.

2014 నాటికి మన దేశంలో 33 లక్షల కేన్సర్ కేసులు నమోదయ్యాయి. ప్రతి ఏడాది మరో పది లక్షల చొప్పున వచ్చి చేరుతున్నాయి.

స్త్రీ, పురుషులు దాదాపు సమానంగానే కేన్సర్ బారిన పడుతున్నారు.

మహిళల్లో రొమ్ము, సర్వికల్ కేన్సర్, పురుషుల్లో లంగ్ కేన్సర్ ఎక్కువగా వస్తోంది.

ఇటీవల కాలంలో 5 నుంచి 12 ఏళ్ల పిల్లల్లో కేన్సర్ కేసులు బాగా పెరుగుతున్నాయి.

## నేలములక ఆకుతో బహు లాభాలు



నేలములక ఆకు రసంలో కొంచెం పసుపు కలిపి, ఆ మిశ్రమాన్ని స్నానానికి ముందు పై పూతగా వాడితే గజ్జి, తామర తగ్గిపోతాయి. అయితే, ఈ మిశ్రమాన్ని వాడినన్ని రోజులు, సబ్బుకు బదులు సెనగపిండితో స్నానం చేయాలి.ఒక తులం వే రు చూర్ణం, అర తులం ఇంగువ కలిపి ఈ మిశ్రమాన్ని తేనెతో కలిపి తీసుకుంటే, ఉబ్బసం వ్యాధి నుంచి ఉపశమనం కలుగుతుంది.నేలములక పూలను నీడపట్టున ఎండించి చూర్ణం చేసి, కాస్తంత చూర్ణంలో తేనె కలిపి నాకిస్తూ ఉంటే చిన్న పిల్లలను చాలా రోజులుగా బాధిస్తున్న దగ్గు కూడా తగ్గిపోతుంది.నేలములక వేళ్ల రసంలో తగినంత తేనె కలిపి తాగుగూ ఉంటే మూత్రంలో మంట, పోటు వంటి అనేక రకాల మూత్రదోషాలు తొలగిపోతాయి.వేరు చూర్ణాన్ని తీయని పెరుగులో కలిపి కొద్ది రోజుల పాటు తాగితే మూత్ర పిండాల్లోని రాళ్లు ముక్కలై పడిపోతాయి.

## శరీరాన్ని వదులు చేసే స్ట్రెచెస్

ఆఫీసుల్లో కదలకుండా గంటల తరబడి కూర్చుంటే, ఆ ప్రభావం శరీరం మీద కచ్చితంగా పడుతుంది. దాంతో పిరుదులు బిగుసుకుపోవటం, నడుము పట్టేయటం, వెన్ను నొప్పి లాంటి సమస్యలు వేధిస్తాయి. వీటి నుంచి ఉపశమనం పొంది, బిగుసుకుపోయిన శరీరం అదుపులోకి రావాలంటే ఇదిగో ఈ స్ట్రెచింగ్ వ్యాయామం చేయాలి. ఇందు కోసం....

కుడి కాలు ముందుకు మడిచి, ఎడమ కాలు వెనక్కి చాపి నేల మీద కూర్చోవాలి. ఈ భంగిమలో కూర్చున్నప్పుడు నడుము బరువంతా మీ కుడి కాలు మీద పడేలా చూసుకోవాలి.

అలాగే ఎడమ పిరుదు నేల వైపు ఉండేలా చూసుకోవాలి.

అలాకాకుండా పై వైపనుకు ఉంటే ఎడమ కాలును మరింత ముందుకు జరపాలి.

ఇలా సౌకర్యవంతంగా కూర్చున్న తర్వాత శరీరాన్ని విల్లులా వెనక్కి వంచి, రెండు చేతులను గాల్లోకి లేపి కలపాలి.

ఈ భంగిమలో ఉండి, 10 అంకెలు లెక్కపెట్టి తిరిగి మామూలు స్థితికి రావాలి.

ఇలాగే కుడి కాలిని ముందుకు, ఎడమ కాలిని వెనక్కి మడిచి చేయాలి.

## కొవ్వు కరిగించే డ్రింక్

వేసవిలో డీహైడ్రేషన్‌కు గురి కాకుండా నిమ్మరసం కాపాడుతుంది. దీన్లోని పీచు ఒంట్లోని కలుషితాలను బయటకు నెట్టేస్తుంది. సబ్జా విత్తనాల్లో పీచుతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ రెండిటినీ కలిపి తీసుకుంటే శరీరంలో పేరుకున్న కొవ్వు ఇట్టే కరిగిపోతుంది. ఇప్పుడు తయారీ ఎలాగో తెలుసుకుందాం!

నీళ్లు - ఒకటిన్నర గ్లాసు

తేనె - ఒకటిన్నర టీస్పూను

నిమ్మరసం - 2 స్పూన్లు

సబ్జా విత్తనాలు - 1 టేబుల్ స్పూను

తయారీ విధానం

ఒక టీస్పూను సబ్జా విత్తనాలను నీళ్లలో కలిపి గంటపాటు కదల్చకుండా ఉంచాలి. దీన్లో మిగతా నీళ్లు, సబ్జా విత్తనాలు, నిమ్మరసం కలిపి బ్లెండర్‌లో తిప్పాలి. ఈ డ్రింక్‌ను ప్రతిరోజూ పరగడుపునే తీసుకోవాలి. ఇలా క్రమం తప్పక చేస్తే తప్పకుండా బరువు తగ్గుతారు.

## బార్లీ.. భలే మంచి ఫుడ్డు

సాధారణంగా ఎక్కువ శక్తినిచ్చే ఆహార పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతూ ఉంటుంది. అయితే బార్లీ ఇందుకు భిన్నమైనది. ఎక్కువ శక్తినిచ్చే పదార్థమే అయినా సులభంగా జీర్ణమవుతుంది. అందుకే అస్వస్థులైన వారికి బార్లీ ద్రావణం ఇస్తూ ఉంటారు. లో-ఫ్యాట్ డైట్‌గా కూడా బార్లీ ఇటీవల బాగా ప్రాచుర్యం పొందుతోంది. చెడు కొలెస్ట్రాల్ పెరుగుతోందన్నా. గ్లూకోజ్ నిలువలు పెరుగుతున్నాయన్నా మనసు వెంటనే వైద్య చికిత్సల మీదికే వెళుతుంది. కానీ, ఆ అవసరం లేకుండా, ప్రకృతి సహజమైన ఆహార పదార్థాలు కూడా వాటి నియంత్ర ణకు తోడ్పడతాయనే అంశం మాత్రం మన ధృష్టికే రాదు. నిజానికి ఈ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిండంలోనూ, ప్రి- డయాబెటిక్ స్థాయికి వెళ్లిన గ్లూకోజ్ నిలువలను సాధార ణ స్థాయికి తీపుకు వెసళ్లడంలోనూ బార్లీ బాగా తోడ్పడుంది. అందుకే టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు బార్లీని తమ ఆహారంలో ఒక ప్రధాన భాగంగా చేర్చుకోవాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మూత్ర విసర్జన సాఫీగా లేక శరీరం ఉబ్బిపోతున్న వారికి బార్లీ ధాన్యం గొప్ప ఔషధంగా (డ్యూరెటిక్) పనిచేస్తుంది. బార్లీ ధాన్యంలో మరో విశేషం కూడా ఉంది. ముఖ్యంగా ఓట్లు, గోదుమల వంటి ధాన్యాన్ని శుద్ధి చేసినప్పుడు వాటిలోని పీచుపదార్థం హరించుకుపోతుంది. కానీ, బార్లీలో ఉండే బీటా - గ్లూకన్ అనే ప్రత్యేక పీచుపదార్థం శుద్ధి చేసిన తర్వాత కూడా స్థిరంగా ఉంటుంది.

## రాత్రివేళ పనిచేసే మహిళలూ...జర జాగ్రత్త



నైట్ షిఫ్టుల్లో పనిచేసే మహిళలు ఎక్కువగా రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారని హార్వర్డ్ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడైంది. రాత్రివేళ పనిచేస్తున్న మహిళలు హార్మోన్ ల మార్పుల వల్ల ట్యూమర్లు ఏర్పడతాయని పరిశోధకులు తేల్చారు. పారిశ్రామికీకరణ వల్ల రాత్రివేళ విద్యుత్ బల్బుల కాంతిలో పనిచేయడం వల్ల మహిళలు అధికంగా రొమ్ము కేన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని హార్వర్డ్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసరు పీటర్ జేమ్స్ చెప్పారు. మానవ మెదడులో ఉత్పత్తి అవుతున్న మెలటోనిన్ అనే హార్మోన్ రొమ్ము కేన్సర్ ట్యూమర్లు పెరగడానికి కారణమవుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. 1,10,000మంది మహిళల డేటాను అధ్యయనం చేయగా రాత్రివేళ పనిచేస్తున్న మహిళల్లో రొమ్ము కేన్సర్ బారిన పడిన వారి సంఖ్య అధికంగా ఉందని తేలింది. అందుకనే నైట్ షిఫ్టులో పనిచేస్తున్న మహిళలూ పారాహుషార్.

## ప్రాణాంతక వ్యాధులు 'క్లారిటీ'గా నిర్ధారణ!



అభివృద్ధికి ఆమడ దూరంలోని పేద దేశాలు, ఇప్పుడిప్పుడే అభివృద్ధిబాట పడుతున్న దేశాల్లో ప్రాణాంతక వ్యాధులను గుర్తించే సౌకర్యాలు అరకొరగా ఉంటున్నాయి. అత్యంత ఖరీదైన పరికరాలతో ఖరీదైన పరీక్షలు చేసే వసతులు ఆయా దేశాల్లో చాలా తక్కువ. మరీ, ముఖ్యంగా కేన్సర్ లాంటి మహమ్మారులను తక్కువ ఖర్చులో గుర్తించే పరీక్షలు అందుబాటులో ఉండడం చాలా తక్కువ. అలాంటి దేశాల్లో మెరుగైన వ్యాధి నిర్ధారణ పద్ధతులను కనుగొనడంలో అమెరికా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్‌ఏంజిలిస్ పరిశోధకులు ముందడుగు వేశారు. భారత సంతతికి చెం దిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజన్ కులకర్ణి సహా పలువురు పరిశోధకులు ఈ సులువైన, తక్కువ ఖర్చులో అయిపోయే వ్యాధి నిర్ధారణ పద్ధతిని కనుగొన్నారు. 'క్లారిటీ' అనే టెక్నిక్ ద్వారా కణజాల శాంపిళ్లను పరిశోధకులు తయారుచేశారు. ఈ పద్ధతిలో కణజాలం పారదర్శకంగా కనిపించడమే కాకుండా కణజాలంలోని కొవ్వు వేరైపోయి పరీక్షకు అవసరమయ్యే డీఎన్ఏ, ప్రొటీన్లు మాత్రమే మిగులుతాయన్నారు. హాలోగ్రాఫిక్ లెన్స్‌ఫ్రీ త్రీడీ మైక్రోస్కోపును అభివృద్ధి చేశామన్నారు.

## 'ఏక వర్ణ' రక్తపరీక్ష!



మామూలుగా కేన్సర్ ముదిరితే తప్ప బయటపడే అవకాశాలు చాలా తక్కువ. ఆదిలోనే ఆ మహమ్మారిని కనుక్కోవడం కొంచెం కష్టమైన పనే. అయితే కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించే రక్త పరీక్షను అభివృద్ధి చేశామంటున్నారు అమెరికా స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు. కేన్సర్ కణాల అభివృద్ధి, వ్యాప్తిని తమ పరీక్ష ద్వారా సులువుగా కనిపెట్టవచ్చంటున్నారు. ఆ పరీక్ష 'ఏక వర్ణ డిజిటల్ పీసీఆర్ (పాలిమరేజ్ చైన్ రియాక్షన్)'! ఈ పరీక్ష ద్వారా కేన్సర్ కణాలు విడుదల చేసిన అతిచిన్న డీఎన్ఏల్లోని జన్యు పరివర్తనాలను సులువుగా గుర్తించవచ్చని వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ హాన్లీ పీ జి చెప్పారు. ప్రతి చెక్‌పలోనూ అప్పటికప్పుడే రోగిలోని కేన్సర్ కణాల వృద్ధి, వ్యాప్తిని తెలుసుకోవచ్చన్నారు. ఈ పరీక్షను సాధారణ లేబొరేటరీల్లోనూ చేయవచ్చని, నిపుణుల పర్యవేక్షణ అవసరం లేకుండానే ఎవరైనా సులువుగా పరీక్ష చేసుకోవచ్చని పరిశోధకులు వివరించారు. తాము అభివృద్ధి చేసిన రక్త పరీక్ష కేన్సర్ రోగులకు ఓ వరం అంటున్నారు.

## రొమ్ము కేన్సర్ చికిత్సకు కొత్త ఔషధం!




మహిళల్లో రొమ్ము కేన్సర్‌ను నిరోధించే కొత్త అణువును కనుగొన్నారు టెక్సాస్ యూనివర్సిటీ పరిశోధకులు. ఈ పరిశోధక బృందంలో భారత సంతతికి చెందిన గణేష్ రాజ్ కూడా ఉన్నారు. ఇప్పటివరకు రొమ్ము కేన్సర్ చికిత్సకు హార్మోన్ థెరపీ వంటి సాంప్రదాయ పద్ధతులను మాత్రమే ఉపయోగిస్తున్నారు. వాటికి కూడా లొంగని రొమ్ము కేన్సర్ కణాలను ఈ కొత్త అణువును కలిగిన 'ఈఆర్ఎక్స్-11' ద్వారా తొలగించవచ్చని గణేష్ తెలిపారు. ఈస్ట్రోజన్ గ్రాహక కేన్సర్ కణాలను ఈ అణువు టార్గెట్ చేస్తుందని చెప్పారు. ఈ ఔషధాన్ని ఎలుకలపై ప్రయోగించామని తెలిపారు.

## కేన్సర్ చికిత్సలో బంగారం సాయం!



కేన్సర్ చికిత్సలో బంగారం చూర (సూక్ష్మ అణువులు) సహాయపడుతుందని యూకేలోని ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌కు వాడే ఔషధాల పనితీరును, ప్రభావాన్ని పెంచుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని తెలిపారు. బంగారం చూర కలిగిన ఒక రసాయన పరికరాన్ని రూపొందించిన పరిశోధకులు.. కీమోథెరపీ దుష్ప్రభావాల్ని తగ్గించడంలో, ఆరోగ్యకర కణజాలానికి ఇబ్బంది కలగకుండా దెబ్బతిన్న కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని చికిత్స చేయడంలో పరికరం ఉపయోగపడుతుందని వివరించారు. మరోవైపు ఒక్కొక్క జీవించి ఉన్న కణాన్ని సంగ్రహించి, మోసుకొని పోయే పాక్-మాన్ లాంటి మైక్రోబాట్‌ను అమెరికాలోని నార్త్ కరోలినా స్టేట్ వర్సిటీ, డ్యూక్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఔషధాలకు కేన్సర్ కణాలు ఎలా స్పందిస్తున్నాయో తెలుసుకునేందుకు ఇది సహాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కీళ్లవాతం ఔషధంతో రక్త కేన్సర్‌కు చికిత్స



రక్త కేన్సర్‌తో బాధపడే రోగులకు కీళ్లవాతానికి ఉపయోగించే ఔషధంతో చికిత్స చేయొచ్చని యూకేలోని వర్సిటీ ఆఫ్ షెఫీల్డ్ పరిశోధకులు తెలిపారు. కీళ్లనొప్పులు నివారించేందుకు వాడే మెథోట్రెక్సేట్(ఎమ్‌టీఎక్స్)పై ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా పాలీసైథేమియా వెరా(పీవీ) రక్త కేన్సర్‌కు చికిత్స అందించే ఆశాజనక ఫలితాలు వచ్చాయని వివరించారు. కాగా, అలర్జీ నివారణకు వాడే ఔషధాలతో కాళ్లలో రక్తం గడ్డకట్టడాన్ని సమర్థంగా త గ్గించొచ్చని తాజా అధ్యయనం తేల్చింది. శస్త్ర చికిత్స తర్వాత, లేక ఎక్కువ దూరం విమాన ప్రయాణం వల్ల వచ్చే డీప్ వీన్ థ్రాంబోసిస్ రాకుండా ఉండడానికి అలర్జీ మందులు బాగా పనిచేసినట్లు ఎలుకలపై చేసిన పరిశోధనల్లో వెల్లడైందని యూకే వర్సి టీ ఆఫ్ బర్మింగ్‌హామ్ పరిశోధకులు పేర్కొన్నారు

# ప్రభాస్ సినిమా కోసం అమ్మడు భారీ రెమ్యూనరేషన్ తీసుకుంటోందట..!



'అనగనగా ఓ ధీరుడు' సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన శృతిహాసన్.. 'ఓ మై ఫ్రెండ్' 'బలుపు' 'ఎవడు' 'గబ్బర్ సింగ్' 'రేసుగుర్రం' 'శ్రీమంతుడు' 'ప్రేమమ్' వంటి సినిమాలతో మంచి పేరు తెచ్చుకుంది. ఒకప్పుడు ఐరన్ లెగ్ అని పిలిపించుకున్న శృతి.. తర్వాత రోజుల్లో వరుస హిట్స్ అందుకుని లక్కీ హీరోయిన్ గా మారిపో యింది. అయితే 'కాటమరాయుడు' సినిమా తర్వాత కొన్నాళ్ళు టాలీవుడ్ కి దూరమైంది. ఈ నేపథ్యంలో మూడేళ్ళ గ్యాప్ తర్వాత 'క్రాక్' సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన 'క్రాక్' బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. దీంతో మళ్ళీ శృతికి వరుస ఆఫర్స్ వస్తున్నాయని తెలుస్తోంది. అయితే సక్సెస్ ఫుల్ హీరోయిన్ అనిపించుకున్న శృతి.. రెమ్యూనరేషన్ కూడా పెంచేసిందని తెలుస్తోంది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ – ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న 'సలార్' సినిమాలో శ్రుతి హాసన్ ని హీరోయిన్ గా తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం అమ్మడు కోటి రూపాయలకు పైగా డిమాండ్ చేసిందట. ఇది 'క్రాక్' 'వసూల్ సాబ్' కంటే ఎక్కువ అని తెలుస్తోంది. దీనికి మేకర్స్ పాజిటివ్ గా స్పందించడంతో 'సలార్' కోసం శృతి బల్క్ డేట్స్ కేటాయించిందని టాక్ నడుస్తోంది.

# ఈషాకు మరో మంచి ఛాన్స్?



మంచి నటిగా, గ్లామరస్ హీరోయిన్‌గా గుర్తింపు సంపా దించుకుని వరుస అవకాశాలు దక్కించు కుంటోంది హీరోయిన్ ఈషా రెబ్బ. లస్ట్ స్టోరీస్‌కు రీమేక్‌గా తెలుగులో తెరకెక్కిన పిట్ట కథలు వెబ్ సిరీస్‌తో ఈషా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ వెబ్ సిరీస్‌లో ఈషా ఓ హాట్ రోల్‌లో కనిపించనున్నట్టు తెలుస్తోంది. తాజాగా ఈషాకు మరో మంచి ఆఫర్ వచ్చినట్టు టాలీవుడ్ వర్గాల సమాచారం. సమంత ప్రధాన పాత్రలో దర్శకుడు గుణశేఖర్ రూపొందించనున్న శాకుంతలంలో ఓ మంచి రోల్ ఈషాకు లభించిందట. ఈ సినిమాలో సమంత స్నేహితురాలి పాత్రలో ఈషా కనిపించనుందట. భారీ బడ్జెట్‌తో, భారీ తారాగణంతో గుణశేఖర్ రూపొందించనున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఈ సినిమాలో కనిపించబోయే నటీనటుల గురించి చిత్రయూనిట్ త్వరలోనే అధికారిక ప్రకటన చేయబోతోంది.

# బుట్టబొమ్మతో ఈ స్టార్ కిడ్ ఎవరో గెస్ చేయగలరా?



అల వైకుంఠపురములో (2020) లాంటి ఇండస్ట్రీ హిట్ మూవీలో నటించింది పూజా హెగ్డే. ఈ మూవీతో తనను బుట్టబొమ్మగా పాపులర్ చేశారు త్రివిక్రముడు. ఆ తర్వాత పూజా కెరీర్ మరో లెవల్ ని టచ్ చేసింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో పూజా లక్కీఛామ్‌గా వెలిగిపోతోంది. ప్రభాస్ సరసన నటించిన రాధేశ్యామ్.. అఖిల్ సరసన నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రాలు త్వరలోనే రిలీజ్ కి రానున్నాయి. తదుపరి యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన కథానాయికగా నటిస్తోంది. ఈ మూవీకి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసినదే. ప్రస్తుతం టీమ్ చిత్రీకరణలో బిజీగా ఉంది. తాజాగా పూజా హెగ్డే ఓ రేర్ ఫోటోని ఆన్ సెట్స్ నుంచి షేర్ చేయగా అది వైరల్ గా మారింది. ఈ ఫోటోలో ముఖ్యంగా ఓ చురుకైన దివ్యమైన రూపం కట్టిపడేస్తోంది. ఆ అందమైన కనుబొమ్మలు... తీరైన పంటి వరుస.. చురుకైన చూపులు.. కంటి పాప మెరుపులు.. వీటన్నిటినీ మించి ఆ పక్క పాపిడి.. చూస్తుంటేనే వ్వావ్ అనాల్సిందే. ఇంతకీ ఎవరీ గడుగ్గాయ్? అన్నది ఆరా తీస్తే షాకిచ్చే సంగతే తెలిసింది. ఆ చిన్నారి బాలకుడు జూనియర్ Jr. NTR. అంటే యంగ్ యమ ఎన్టీఆర్ జూనియర్ అన్నమాట. ఆన్ సెట్లో ప్లేయింగ్ విత్ Jr. Jr. NTR. అంటూ లవ్ ఈమోజీని పూజా షేర్ చేసింది. ఇప్పటికి అర్థమైంది కదా? ఆ చిన్నారి అభయ్ రామ్(6) అన్న సంగతి. చూస్తుండగానే ఎదిగేస్తున్నాడు. ఆరేళ్ల బాలకుడు ఇపుడు. ఆ రూపు రేఖలు చూస్తుంటే డాడీ ఎన్టీఆర్ నే తలపిస్తున్నాడు. తీరైన సమ్మోహన రూపంతో ఆకట్టుకుంటున్నాడు. ఇక నందమూరి ఫ్యామిలీ నుంచి నెక్ట్స్ జెన్ బాల నటుడిగా.. అటుపైనా హీరోగా అతడే పెద్ద రేంజు చూపిస్తాడనడంలోనూ ఎలాంటి సందేహం లేదు. నందమూరి వంశం నుంచి తారక రాముని లెగసీని నిలబెట్టే వారసుడి రూపం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది.

# జాంబిరెడ్డి హిట్టయితేనే సమంతతో సీక్వెల్?!



ఒక్కోసారి మాటలు కోటలు దాటుతుంటాయి. ఫలానా దర్శకుడు ట్యాలెంటెడ్ .. అతడితో కలిసి సినిమా చేస్తానని ప్రకటించేస్తారు. కానీ అదేమీ అంత సులువేమీ కాదు. సెట్స్ లో ఉన్న సినిమా రిలీజవ్వాలి. అది కన్ఫామ్ గా సక్సెస్ వ్వాలి. అప్పుడే సదరు యువదర్శకుడికి ఇచ్చిన ప్రామిస్ నెరవేరుతుంది. ఒకవేళ సినిమా పరాజయం పాలైతే డౌటే. ఇప్పుడు సమంత కూడా నవతరం దర్శకుడు ప్రశాంత్ వర్మకు అలాంటి ప్రమిస్సే ఇచ్చినట్టు భావించాల్సి వస్తోంది. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన జాంబి రెడ్డి ఈ వారంలో రిలీజవుతోంది. ఈ సిని మా హిట్టయితేనే ప్రశాంత్ వర్మతో సమంత సినిమా చేస్తారా? అన్న చర్చా వేడెక్కిస్తోంది. అతడితో సినిమా చేస్తానని ఇంతకుముందు ప్రకటించిన సమంత.. ప్రస్తుతం జాంబిరెడ్డి సీక్వెల్ స్టోరీని వినేందుకు రెడీ అవుతున్నారట. సీక్వెల్ ఫైనల్ డ్రాఫ్ట్ విన్న తర్వాత ఫైనల్ కాల్ చేయాలని సామ్ భావిస్తున్నారట. ప్రస్తుతం కథా చర్చలు సాగుతున్నాయి. అయితే ఓకే చెప్పే ముందే.. జాంబీ రెడ్డి ప్రేక్షకులను ఆకట్టుకోవాలి. విజయవంతం కావాలి. టాలీవుడ్ తొలి జాంబీ మూవీ అంటూ ప్రశాంత్ వర్మ ఇప్పటికే బోలెడంత ప్రచారం చేస్తున్నారు. ఇందులో తేజా సజ్జా– ఆనందీ– దక్ష నాగర్కర్ ప్రధాన పాత్రలు పోషించారు. విజయంపై టీమ్ ధీమాను వ్యక్తం చేస్తోంది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెసైతే సామ్ నుంచి ఓకే అన్న పిలుపు అందుతుందని ఆశిస్తున్నారు. మరోవైపు సమంత తన తదుపరి తమిళ చిత్రం కాతువాకుల రేండు కాదల్ షూటింగ్ లో బిజీగా ఉన్నారు. గుణశేఖర్ దర్శకత్వంలో శాకుంతలం షూటింగ్ లోనూ సమంత పాల్గొనాల్సి ఉంది.

# ఐటెం సాంగ్‌లకు గేట్లు ఎత్తేసిన జబర్దస్త్ యాంకర్



జబర్దస్త్ యాంకర్ గా స్టార్ డం దక్కించుకున్న అనసూయకు మొదట్లో అత్తారింటికి దారేది సినిమాలో ఐటెం సాంగ్ ఆఫర్ వచ్చింది. కొన్ని కారణాల వల్ల ఆ ఐటెం సాంగ్ కు నో చెప్పింది. ఆ సమయంలో పవన్ అభిమానులు తీవ్ర స్థాయిలో ఆమెను విమర్శించిన విషయం తెల్సిందే. ఆ సమయంలో తనకు ఐటెం సాంగ్ లపై ఆసక్తి లేదని చెప్పుకొచ్చింది. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్ సినిమాలో ఒక ఐటెం సాంగ్ ను చేసిన అనసూయ మళ్లీ ఐటెం సాంగ్ లకు నో చెబుతూ వచ్చింది. ఐటెం సాంగ్ ల విషయంలో మొన్నటి వరకు కాస్త వేరే అభిప్రాయం ఉన్న అనసూయ ఇటీవల ఆ అభిప్రాయంను పక్కకు పెట్టి ఆఫర్లకు గేట్లు ఎత్తేసినట్లుగా తెలుస్తోంది. అందుకే వరుసగా ఐటెం సాంగ్ ఆఫర్లు వస్తున్నాయి. అనసూయ ఇటీవలే చావు కబురు చల్లగా సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. కార్తికేయ లావణ్య త్రిపాఠి జంటగా రూపొందుతున్న ఆ సినిమాలో అనసూయ ఐటెం సాంగ్ మాస్ మసాలా దట్టించినట్లుగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. ఇక తాజాగా పవన్ తో క్రిష్ చేయబోతున్న సినిమాలో కూడా అనసూయ ఒక ఐటెం సాంగ్ ను చేయబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మొదట కీలక పాత్రలో అనసూయ నటించబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. కాని తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం అనసూయను ఐటెం సాంగ్ కోసం క్రిష్ సంప్రదించాడనే వార్తలు వస్తున్నాయి. త్వరలోనే పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989